

తొలగిన జిన్నింగ్ గండం

- సీసీఐ, జిన్నింగ్ మిల్లుల మధ్య పత్తి బేళ్ల వివాదం
- మిల్లులకు చార్జి చెల్లించడంలో సీసీఐ వివక్ష చూపుతోందని ఆరోపణలు
- రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా మిల్లుల సమ్మె
- పరిష్కరించిన మంత్రి తుమ్మల
- సీసీఐ కేంద్రాల్లో ప్రారంభమైన కొనుగోళ్లు

ఖమ్మం మార్కెట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ), జిన్నింగ్ మిల్లుల యజమాన్యాల మధ్య తలెత్తిన వివాదం సద్దుమణిగింది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సీసీఐ సీఎండీ, జిన్నింగ్ మిల్లుల యజమాన్యాలతో చర్చలు జరిపి జిన్నింగ్ మిల్లుల నిరవధిక సమ్మెను విరమింపచేశారు. పత్తి రైతులు ఇబ్బందులు పడకుండా, పత్తిని తక్కువ ధరలకు దళారులకు అమ్మాల్సిన పరిస్థితి తలెత్తకుండా వారిరువురి మధ్య చర్చలతో సయోధ్య కుదిర్చి సమ్మె విరమింప చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిన్నింగ్ మిల్లుల వద్ద సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలలో పత్తి కొనుగోళ్ల తక్షణమే ప్రారంభించాలని అధికారులను ఆదేశించడంతో పత్తి రైతులు ఊపిరి పీల్చుకున్నారు. రైతుల ప్రయోజనాలను కాపాడడంలో జిన్నింగ్ మిల్లుల యజమాన్యాలు, సీసీఐ అధికారులు కీలకంగా ఉండాలని మంత్రి తుమ్మల సూచించారు.

వివాదం ఇలా..

సీసీఐ కేంద్రాలలో పత్తి కొనుగోళ్ల జరిపిన తరువాత జిన్నింగ్ మిల్లుల యజమాన్యాలు 5 క్వింటాళ్ల పత్తిని జిన్నింగ్ చేసి 175 కేజీలు ఉండే ఒక బేల్‌ను సీసీఐకి తిరిగి ఇస్తాయి. ఇందుకు గాను రూ.1300 నుంచి రూ.1500 వరకు చార్జి ఇవ్వాలని కోట్ చేస్తాయి. టెండర్లలో భాగంగా కొన్ని జిన్నింగ్ మిల్లులు ఒక బేల్ పత్తికి రూ.1300 నుంచి రూ.1400, మరికొన్ని యజమాన్యాలు రూ.1500 వరకు టెండర్లు కోట్ చేశాయి. తక్కువ చార్జికి టెండర్లు కోట్ చేసిన వారిని ఎల్-1గా మధ్యస్థంగా టెండర్లు కోట్ చేసిన వారిని ఎల్-2గా, కాస్త ఎక్కువగా టెండర్లు కోట్ చేసిన వారిని ఎల్-3గా పరిగణిస్తారు.

కాగా సీసీఐ అధికారులు తక్కువ టెండర్లు కోట్ చేసిన వారి దగ్గర్నుంచి పత్తి బేళ్లను త్వరితగతిన తయారు చేసేందుకు అవకాశం ఇస్తున్నారని, ఎక్కువగా టెండర్లు కోట్ చేసిన వారిని పట్టించుకోవడం లేదని జిన్నింగ్ మిల్లుల యజమాన్యాలు ఆరోపిస్తున్నాయి. ఈ క్రమంలో ఎక్కువ మొత్తంలో టెండర్ కోట్ చేసిన వారినే మొదట పత్తి జిన్నింగ్ ఆడించే అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సమ్మెకు పిలుపునిచ్చారు. కాగా ఈ సమస్య మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, వరంగల్ తదితర జిల్లాలో మాత్రమే ఉందని, ఖమ్మం జిల్లాకు సంబంధం లేకపోయినా, రాష్ట్ర జిన్నింగ్ మిల్లుల అసోసియేషన్ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేయాలని నిర్ణయించుకున్నట్లు జిన్నింగ్ మిల్లుల యజమాన్యాలు తెలుపాయి.

9 కేంద్రాల్లో కొనుగోళ్లు

మంత్రి తుమ్మల చర్చల కారణంగా జిన్నింగ్ మిల్లుల యజమాన్యాలు, సీసీఐ మధ్య సయోధ్య కుదిరింది. దీంతో జిల్లాలో ఉన్న మొత్తం 9 సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో మధ్యాహ్నం పత్తి కొనుగోళ్ల తిరిగి ప్రారంభమయ్యాయి. కాగా సీసీఐ సెంటర్లలో ఇప్పటివరకు 970 మెట్రిక్ టన్నుల పత్తిని కొనుగోలు చేశామని జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారులు చెబుతున్నారు.

మిల్లుల యజమాన్యాలకు వ్యాపారుల సంఘీభావం

సీసీఐ, జిన్నింగ్ మిల్లుల యజమాన్యాలకు మధ్య తలెత్తిన ఎల్-1, ఎల్-2, ఎల్-3 టెండర్ల వివాదంలో భాగంగా జిన్నింగ్ మిల్లుల యజమాన్యాలు రాష్ట్రవ్యాప్తంగా సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో సోమవారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో పత్తి రైతులకు సంఘీభావంగా పత్తి వ్యాపారులు కొనుగోళ్ల నిలిపి ఆందోళన నిర్వహించారు. పత్తి రైతులు మద్దతు ధర దక్కక తీవ్రంగా నష్టపోతున్నారని, పత్తి కొనుగోళ్లను వెంటనే నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన బాట పట్టారు. దీంతో మార్కెట్లో సుమారు రెండు గంటలపాటు కొనుగోళ్ల స్తంభించాయి.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- కలెక్టరేట్‌లో ఉత్సాహంగా సాగిన ప్రజావాణి

6


ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్


వైరాలో క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే రాందాస్ నాయక్


జాతీయ జెండాలతో క్రీడాకారుల మార్చ్‌ఫాస్ట్

ఒలింపిక్స్ లక్ష్యంగా క్రీడలకు ప్రాధాన్యం

- సోదరభావంతో క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలి: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- వైరాలో ఘనంగా ప్రారంభమైన 10వ జోనల్‌స్థాయి బాలికల స్పోర్ట్స్‌మీట్
- 14 గురుకులాల నుంచి పోటీ పడుతున్న 1190 మంది విద్యార్థినులు

6

ఖమ్మం జిల్లాలో సాగునీటి సౌకర్యం లేని మండలంగా ఉన్న రఘునాథపాలెం మండలానికి రూ.66.35 కోట్లతో ఎన్ఎస్‌పీ కెనాల్‌పై మంచుకొండ ఎత్తిపోతల పథకం మంజూరైందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. వచ్చే ఆగస్టు 15నాటికి ఈ ప్రాజెక్టు పనులు పూర్తిచేసి రైతులకు సాగునీరు అందిస్తామని తెలిపారు.


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

రూ.66.35 కోట్లతో మంచుకొండ 'ఎత్తిపోతల'

మెరక ప్రాంతమైన రఘునాథపాలెం మండలానికి సాగునీరు

- వచ్చే ఆగస్టు 15నాటికి ప్రాజెక్టు పూర్తికి చర్యలు
- జిల్లాలో జాతీయ రహదారుల పూర్తికి కసరత్తు
- రైతులకు ఇచ్చిన హామీలన్నీ అమలుచేస్తున్నాం
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, నేషనల్ హైవే అథారిటీ అధికారులు దివ్య, యుగంధర్‌తో కలిసి సోమవారం మంత్రి తుమ్మల ఖమ్మం-దేవరపల్లి రహదారి పనులను పరిశీలించారు. అలాగే నాగపూర్-అమరావతి, ఖమ్మం-కురవి, ఖమ్మంరింగ్ రోడ్డు పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం దేవరపల్లి రహదారిపై ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ తాను 20ఏళ్లపాటు రాష్ట్రమంత్రిగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 45 మండలాలకు చిన్న, మధ్యతరహా ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాల ద్వారా సాగునీరు అందించానన్నారు.

గత ప్రభుత్వ హయాంలోనూ భక్తరామదాసుతో పాలేరు నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేశానని గుర్తుచేశారు. రఘునాథపాలెం మండలం మున్నేరు, వైరా నదుల సమీపంలో ఉన్నా భౌగోళికంగా ఎత్తయిన ప్రాంతంగా ఉండడంతో సాగునీరు కల్పించలేకపోయానన్నారు. ఇప్పుడు ఎన్నెస్పీ ఎడమకాలవ డీప్‌కట్ వద్ద భారీ ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. మంచుకొండ ఎత్తిపోతల పథకం పేరుతో ప్రభుత్వం నుంచి రూ.66.35కోట్లతో మంజూరు వచ్చిందని తుమ్మల వివరించారు. ఈ పథకంతో రఘునాథపాలెం మండలంలోని చెరువులన్నింటినీ సాగర్ నీటితో నింపడంతోపాటు గ్యాప్ ఆయకట్టును అభివృద్ధి చేసే అవకాశం ఉంటుందన్నారు. ఖమ్మం నగరానికి ఈ మండలం నుంచే కూరగాయాలు అధికంగా వస్తున్నాయని, గిరిజన రైతులు కూడా సాగునీరు లేకపోయినా ఉన్న వనరులతో కూరగాయలు పండిస్తున్నారన్నారు. ఈ ఎత్తిపోతల ద్వారా నీరు అందిస్తే రఘునాథపాలెం మండలం సస్యశ్యామలం అవుతుందన్నారు.

హామీలన్నీ అమలు చేస్తున్నాం..

దేశంలో రూ.2లక్షలలోపు రుణమాఫీ చేసిన ప్రభుత్వం తమదేన్నారు. ఇప్పటికే 22 లక్షల మంది రేషన్‌కార్డు కలిగిన రైతులకు రూ.18వేల కోట్లు రుణమాఫీ చేశామని తెలిపారు. తెల్లకార్డులేని 4లక్షల మంది రైతుల కుటుంబాలను కూడా నిర్ధారణ చేశామని వీరికి సుమారు రూ.3వేల కోట్లు (మిగతా 6వ పేజీలో)

యథావిధిగా పత్తి కొనుగోళ్లు

సీసీఐకి జిన్నింగ్ మిల్లు యజమానులకు మధ్య ఉన్న వివాదాన్ని పరిష్కరించామని మంత్రి తుమ్మల తెలిపారు. సీసీఐ ద్వారా రాష్ట్రంలో పత్తి కొనుగోళ్ల యథావిధిగా జరుగుతున్నాయన్నారు. సీసీఐ ఎండీతో జిన్నింగ్ మిల్లు యజమానులు చర్చలు జరిపారని, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిబంధనలను దృష్టిలో ఉంచుకొని ఎండీని హైదరాబాదు రప్పించి మార్కెటింగ్‌శాఖ ద్వారా జిన్నింగ్‌మిల్లు యజమానులకు సీసీఐ ఎండీతో సమావేశం పెట్టి సమస్యలు పరిష్కరించినట్లు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం నుంచి పత్తి కొనుగోళ్ల ప్రారంభించామన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చే సన్నధాన్యానికి క్వింటాకు రూ.500బోనస్ ఇచ్చి తీరుతామన్నారు.

మార్చి నాటికి ఖమ్మం-దేవరపల్లి రహదారి పనులు

ఖమ్మం-దేవరపల్లి జాతీయ రహదారిని వచ్చే మార్చినాటికి పూర్తిచేయించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తుమ్మల తెలిపారు. ఈ జాతీయ రహదారి పనులు 165కి.మీ .పొడవున 3 ప్యాకేజీలుగా ప్రారంభించామని, ప్యాకేజీ పనులన్నీ 65 శాతం పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన పనులు మార్చి నాటికి పూర్తవుతాయన్నారు. ఈ రహదారికి ఏడు చోట్ల ఎగ్జిట్‌లు మంజూరయ్యాయని, ధంసలాపురం ఎగ్జిట్‌ను కొత్తగా మంజూరు చేశామని తెలిపారు. అలాగే విజయవాడ-నాగపూర్ జాతీయ రహదారి పనులు కూడా ప్రారంభమయ్యాయని తెలిపారు. ఖమ్మానికి రింగ్‌రోడ్డు వచ్చేలా రూ.120కోట్లతో కాచిరాజుగూడెం నుంచి 7కి.మీ. రహదారి నిర్మించి రింగ్‌రోడ్డుకు అనుసంధానం చేయబోతున్నామన్నారు.

నేను నా ఖమ్మం

మున్నేరు తీరం సుందరీకరణకు ఈ నెల 14న ప్రత్యేక కార్యాచరణ



ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 11: ముళ్ల పొదలు, చెత్త, డంపింగ్ వ్యర్థాలు, పరిశ్రమల వ్యర్థాలతో దుర్వాసన వ్యాప్తి చెందుతూ.. రహదారిపై వెళ్లే వారు అటు ఇటు చూస్తే చెత్తాచెదారంతో కనిపించే మున్నేరు ఇక నందనవనంగా మారనుంది. ఈనెల 14న ఖమ్మం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో 'నేను నా ఖమ్మం' కార్యక్రమం రూపొందించారు. మున్నేరు పరివాహక ప్రాంతంలో ముళ్ల పొదలు, చెత్త, ఇతర వ్యర్థాలను యంత్రాలతో తొలగించి పరిశుభ్రంగా చేసి ఆ ప్రాంతంలో కేఎంసీ ఉద్యాన విభాగం ఆధ్వర్యంలో వేలాదిగా మొక్కలను నాటేందుకు కార్యాచరణ చేశారు. ఈ మేరకు ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఇన్‌చార్జ్ కమిషనర్ శ్రీజ, అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్ షఫి ఉల్లా, ఇతర అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈనెల 14న ప్రత్యేక క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం ద్వారా మొక్కలను నాటి, వాటి సంరక్షణ చర్యలకు కార్యాచరణ చేయాలని సమీక్షించారు.

టెన్త్ పరీక్ష ఫీజు గడువు 18

ఖమ్మం ఖానాపురంహవేలి నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వ ఆదీనంలో ఉన్న, ప్రైవేటు పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఈ నెల 18 వరకు గడువు ఉందని జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ తెలిపారు. ఆలస్య రుసుం రూ.50తో డిసెంబరు 2 వరకు, రూ. 200లతో డిసెంబరు 12వరకు, రూ. 500లతో డిసెంబరు 21వరకు ఫీజు చెల్లించవచ్చని తెలిపారు.

భద్రాద్రికి కార్తీక ఏకాదశి శోభ



- శివాలయంలో చందనోత్సవం
- కార్తీక దీపాలు వెలిగించిన దేవస్థానం ఈవో, భక్తులు
- గోదావరి నదికి ప్రత్యేక హారతులు

భద్రాచలం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో సోమవారం రెండో కార్తీక సోమవారం కావడంతో తెల్లవారుజాము నుంచే శివనామస్మరణతో శైవక్షేత్రాలతోపాటు రామాలయం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజామునే భక్తులు గోదావరిలో స్నానాలు ఆచరించి నదిలో కార్తీకదీపాలను వెలిగించడంతోపాటు గౌరీమాతకు, గోదావరి నదికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే నదికి సమీపంలోని అంజనేయస్వామి ఆలయం, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం, లక్ష్మీనర్సింహస్వామి ఆలయాల్లో భక్తులు కార్తీక దీపాలను వెలిగించడంతోపాటు స్వామివార్లను దర్శించుకున్నారు. అలాగే రామాలయంలో సైతం తెల్లవారుజాము నుంచే భక్తులు కార్తీక దీపాలను వెలిగించడంతోపాటు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని ఐటీడీఏ రోడ్డు శివాలయం, ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న కనకదుర్గ అమ్మవారి ఆలయం, శాంతినగర్‌లోని లలితాపరమేశ్వరి ఆలయం, సాయిబాబా ఆలయం, తాతగుడి సెంటర్‌లోని అంజనేయస్వామి ఆలయాల వద్ద సైతం తెల్లవారుజాము నుంచే భక్తులు పూజలు చేశారు.

శివాలయంలో చందనోత్సవం

దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీఅన్నపూర్ణదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో కార్తీక సోమవారం సందర్భంగా స్వామివారికి దేవస్థానం ఆధ్వర్యంలో వైభవంగా చందనోత్సవం నిర్వహించారు.అదేవిధంగా సాయంత్రం శివాలయంలో కార్తీక దీపారాదన కార్యక్రమం నిర్వహించగా మహిళ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్తీక దీపాలను వెలిగించారు. దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి ఈ కార్యక్రమంలో పాల్గొని కార్తీక దీపాలను వెలిగించారు. సాయంత్రం గోదావరి నది వద్ద దేవస్థానం ఆధ్వర్యంలో గోదావరికి నదీ హారతి సమర్పించారు.



పోలీసు అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న డీజీపీ జితేందర్

మావోయిస్టులు అభివృద్ధి నిరోధకులు

- వారి వల్ల అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలి
- పోలీసు అధికారులతో డీజీపీ జితేందర్ సమీక్ష

బూర్గంపాడు/కొత్తగూడెం/భద్రాచలం నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంత అభివృద్ధి నిరోధకులుగా మారిన మావోయిస్టుల వల్ల ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తెలంగాణ-ఛత్తీస్‌గడ్ రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో పనిచేసే అధికారులు తగిన చర్యలు చేపట్టాలని డీజీపీ జితేందర్ సూచించారు. మావోయిస్టుల కదలికలపై అధికారులతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండల పరిధిలోని సారపాకలో గల ఐటీసీ గెస్ట్‌హౌస్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. హైదారాబాదు నుంచి సారపాక ఐటీసీ గెస్ట్‌హౌస్‌కు వచ్చిన డీజీపీకి భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు ఘనస్వాగతం పలికారు. డీజీపీతోపాటు ఇంటెలిజెన్స్ శివధర్‌రెడ్డి, మల్టీ జోన్-1 ఐజీ పీ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం సమావేశంలో పాల్గొన్న అధికారులు సరిహద్దు ప్రాంతాల్లో మావోయిస్టుల కదలికలపై ప్రస్తుత స్థితిగతులను డీజీపీకి వివరించారు.

ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ పొరుగు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో పనిచేసే అధికారులు తగిన చర్యలు చేపట్టాలని తెలిపారు. పొరుగు రాష్ట్రాల సరిహద్దు అధికారులతో (మిగతా 6వ పేజీలో)

శాశ్వత రక్షణ చర్యలు చేపట్టరా!?

- గోదావరిలో తరచూ ప్రమాదాలు
- ప్రాణాలు కోల్పోతున్నా పట్టించుకోని అధికార యంత్రాంగం

భద్రాచలం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి రామయ్య దర్శనార్థం వచ్చే భక్తులు పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు చేస్తున్న


ఇటీవల హైదరాబాద్‌కు చెందిన మహిళను ఒడ్డుకు తీసుకొస్తున్న గజ ఈతగాళ్లు

సమయంలో లోతును అంచనా వేయలేక ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల కాలంలో భద్రాచలం గోదావరీ నదీ తీరంలో స్నాన ఘట్టాల వద్ద తరచూ స్నానానికి వెళ్లిన భక్తులు గల్లంతవ్వటంతో వారి బంధువులు కన్నీటిపర్యంతమవుతున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశం నలుమూలల నుంచి తరలివచ్చే భక్తులు గోదావరిలో స్నానమాచరించే సమయంలో స్థానిక పరిస్థితులపై అవగాహన లేకపోవటంతో ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల 20రోజులలో ఐదు ఘటనలలో 9 మంది భక్తులు మునిగిపోతుండగా స్థానికులు వారిని రక్షించారు. కాగా ఒకరు మృతి చెందారు. ఇటువంటి దురదృష్టకర సంఘటనలు చోటుచేసుకుంటున్నా.. అధికార యంత్రాంగం శాశ్వత రక్షణ చర్యలపై దృష్టి సారించకపోవటం పట్ల సర్వత్రా ఆక్షేపణలు వ్యక్తమవుతున్నాయి.

తరచూ ప్రమాదాలు

గోదావరిలో ఇటీవల కాలంలో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అక్టోబరు 18న నలుగురు గోదావరిలో లోతును అంచనా వేయలేక మునిగిపోతుండగా లక్ష్మణరావు అనే ఫొటోగ్రాఫర్ వారిని కాపాడారు. 20న ఇరువురు, 24న ఒకరు ఇదే రీతిలో మునిగిపోతుండగా స్థానిక గజ ఈతగాళ్లు వారిని కాపాడారు. 31న హైదరాబాద్‌కు చెందిన చలపతి మృతి చెందారు. తాజాగా శనివారం హైదరాబాద్ నుంచి రామయ్య దర్శనం కోసం వేర్వేరుగా వచ్చిన భక్తులలో ఇరువురిని స్థానిక గజ ఈతగాళ్లు ప్రసాద్, చిన్నాలు కాపాడారు. పద్మ తమ కుటుంబ సభ్యులతో రాగా ఆమె మునిగిపోతున్న క్రమంలో వారు కాపాడారు. అలాగే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సాయిని సైతం కాపాడారు.

చర్యలపై దృష్టి సారించరా..?

వాస్తవానికి గోదావరిలో ప్రమాదాలు తరుచూ జరుగుతున్న ఇటువంటి చోట్ల స్నానాలు చేయడం నిషేధం అనే బోర్డులను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అదేవిధంగా లోతు ఉండే ప్రాంతంలోకి భక్తులు


ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేని దృశ్యం

వెళ్లకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని భక్తులు సూచిస్తున్నారు. అలాగే మైకు ద్వారా భక్తులు, పర్యాటకులను గోదావరి లోతుపై హెచ్చరిస్తూ ప్రచారం చేయాల్సిన అవసరం ఉంది. గోదావరి స్నాన ఘట్టాల వద్ద గజ ఈతగాళ్లు, ఇరువురు అందుబాటులో ఉంటుండగా వారికి తోడుగా ఒక హోంగార్డును నియమించడం వల్ల ప్రమాదాలను నివారించేందుకు మరింత వీలుంటుంది. ఈ విషయంపై రెవెన్యూ, పోలీసు, జల వనరుల, అగ్నిమాపకశాఖ, భద్రాద్రి దేవస్థానం, గ్రామపంచాయతీ అధికారులు భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని భద్రాద్రివాసులు కోరుతున్నారు.

కారుపై సమగ్ర సర్వే స్టిక్కర్

మొదటి అంతస్తుకు వెళ్లలేక యజమాని కారుకు స్టిక్కర్ వేసిన సిబ్బంది



ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 11: రాష్ట్ర ప్రజల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులాల సమాచారం సేకరించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేలో ఓ విచిత్రం సోమవారం ఖమ్మం నగరంలో వెలుగుచూసింది. ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో 1,68,875 నివాసాలకు స్టిక్కరింగ్ కార్యక్రమం సోమవారం పూర్తి చేశారు. కాగా నగరంలోని ఓ కారుకు సమగ్ర కుటుంబ సర్వే స్టిక్కర్ అంటించడం చర్చనీయాంశంగా మారింది. 58వ డివిజన్‌లో కారు యజమాని ఎం.రాధాకృష్ణ ఇంటి మొదటి అంతస్తులో ఉంటుండగా.. ఇంటింటి సర్వేకు వచ్చిన బృందాలు పైన ఉన్న ఇంటికి కాకుండా తన కారుకు స్టిక్కర్‌ను అంటించి వెళ్లారని రాధాకృష్ణ ఫోన్‌లో 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. కారుకు కుటుంబ సర్వే స్టిక్కర్ అంటించడం వైరల్ కావటంతో ఈ ఘటనపై ఖమ్మం నగర ఇన్‌చార్జ్ కమిషనర్ శ్రీజ స్పందించారు. సమగ్ర సర్వే స్టిక్కర్ నివాసాలకు మాత్రమే అంటించాలని, కారుకు అంటించటంపై విచారణ చేసి సదరు సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ మేరకు విచారణ జరపాలని ఆర్వో శ్రీనివాసరావును ఇన్‌చార్జ్ కమిషనర్ శ్రీజ ఆదేశించారు.

ఓపెన్ స్కూల్ పరీక్ష ఫలితాలు విడుదల

ఖమ్మం ఖానాపురంహవేలి నవంబర్ 11(ఆంధ్రజ్యోతి): అక్టోబరులో నిర్వహించిన ఓపెన్ స్కూల్ పదోతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలను సోమవారం విడుదల చేశారని జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ, ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ పాపారావులు తెలిపారు. పదోతరగతిలో మొత్తం 340మంది పరీక్షలకు హాజరు కాగా 182మంది ఉత్తీర్ణులైనట్లు, ఇంటర్మీడియట్‌లో మొత్తం 380మందికి 216మంది ఉత్తీర్ణత సాధించినట్టు తెలిపారు. పరీక్షా ఫలితాలు ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కావాల్సిన అభ్యర్థులు ఈ నెల 14నుంచి 20వ తేదీలోపు ఆన్‌లైన్, మీసేవా సెంటర్లలో ఫీజు చెల్లించి దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. రీకౌంటింగ్‌కు పదోతరగతికి ఒక్క సబ్జెక్టుకు రూ.350, ఇంటర్మీడియట్‌కు రూ.400లు, రీ వెరిఫికేషన్‌కు పదోతరగతికి రూ.1200లు, ఇంటర్మీడియట్‌కు రూ.1200లు చెల్లించాలని తెలిపారు.

రాష్ట్రంలో రాక్షస పాలన

- మళ్లీ శ్రీరాముడి పాలన వస్తుంది..
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ తాతా మధు

భద్రాచలం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాక్షస పాలన నడుస్తోందని, మళ్లీ శ్రీరాముడి పాలన వచ్చే రోజులు ముందున్నాయని ఎమ్మెల్సీ తాతా మధు అన్నారు. భద్రాచలంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కచ్చితంగా తెలంగాణలో కేసీఆర్


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధు

ముఖ్యమంత్రి అవుతారన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో పాలన గాలికి వదిలి పక్క రాష్ట్రంలో ఎన్నికలకోసం ముఖ్యమంత్రి, మంత్రులు ఉరుకులు, పరుగులు పెడుతున్నారని, అసలు రాష్ట్రంలో పాలన ఉందా అని ప్రజలు ఆలోచిస్తున్నారన్నారు. పార్టీ నుంచి వెళ్లిన ఎమ్మెల్యేలు, నాయకులు ఎందుకు వెళ్లామో అని తల పట్టుకుంటున్నారని, పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు బయటకు వెళ్లిన వారిని తీసుకోమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మూసీ నది వెంట తిరుగుతూ టైంపాస్ చేస్తున్నారని, రైతులకు రైతుబంధు లేదు, బీమా లేదు, రైతాంగం నోట్లో మట్టికొట్టిన కాంగ్రెస్ పతనం కాయమన్నారు. ఇచ్చిన హామీల అమలుకు పోరాటం చేస్తామని లక్షలాది కార్యకర్తల సమూహమే గులాబీ సైన్యమన్నారు. ఈ విలేకరుల సమావేశంలో నాయకులు మానె రామకృష్ణ, ఆకోజు సునీల్‌కుమార్, రేపాక పూర్ణ చందర్‌రావు, బిక్కసాని శ్రీనివాసరావు, వల్లూరిపల్లి వంశీకృష్ణ పాల్గొన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలు ఏకరువుపెట్టగా తక్షణమే దరఖాస్తులను పరిష్కరించాలని కలెక్టర్ జిల్లా అధికారులను ఆదేశించారు.


ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

ఫిర్యాదుల్లో కొన్ని..

● వైరా మండలం పాలడుగు గ్రామానికి చెందిన బట్టు రంగయ్య తాను కుష్టు వ్యాధితో బాధపడుతున్నానని, వికలాంగుల పెన్షన్ పొందానని, ప్రస్తుతం వికలాంగ ధ్రువీకరణ దరఖాస్తు గడువు ముగియడంతో పింఛన్ రావడం లేదని, తనకు సదరం సర్టిఫికెట్, పింఛన్ ఇప్పించాలని కలెక్టర్‌ను కోరాడు.

● కొణిజర్ల మండలం సాలెబంజర గ్రామానికి చెందిన బి.రాజేశ్వరి ఖమ్మానికి చెందిన శ్రీజయ విలాసిని డెవలపర్స్ కన్‌స్ట్రక్షన్ ఎండీ రూ.17 లక్షలు ఇవ్వాల్సి ఉందని, ఆ డబ్బులు అడిగితే గిరిజన మహిళనైన తనను ఫోన్‌లో తిడుతూ రివాల్వర్‌తో చంపుతానని బెదిరిస్తున్నారని, తనకు రక్షణ కల్పించి అతనిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేయగా.. ఖమ్మం ఏసీపీని చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

● బోనకల్ మండలం పెద్దబీరవల్లి గ్రామానికి చెందిన పి.సుమిత్ర సర్వే నెంబర్ 575లో ప్రభుత్వం సుమారు 40మందికి అసైన్ పట్టాలు పంపిణీ చేసిందని, వీటిలో తనకు రెండెకరాలు కేటాయించిందని, పట్టా పాస్ పుస్తకం కూడా ఉందని, తన భూమిలో 20 గుంటల భూమిని నాగబోయిన రమాదేవి ఆక్రమించిందని, ఆ భూమి తిరిగి ఇప్పించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసింది.

అనంతరం మౌలానా అబుల్ కలాం ఆజాద్ జన్మదినం సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన మైనార్టీ సంక్షేమ దినోత్సవంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో డీఆర్వో రాజేశ్వరి, డీఆర్డీవో సన్యాసయ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

హార్వెస్టర్లతో జర జాగ్రత్త

ఖమ్మం వ్యవసాయం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అంతటా వరికోతలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం ఏ గ్రామంలో చూసినా వరి కోతలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. కోతలు గంటల్లోనే పూర్తవుతున్నాయి. రైతులు ధాన్యాన్ని నేరుగా కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. పంట కోసే సమయంలో రైతులు, యజమానులు అప్రమత్తంగా లేకుంటే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. యంత్రాల ద్వారా పని సులువు అవుతున్నా.. నిర్లక్ష్యంగా ఉంటే ప్రమాదాలు సంభవించే అవకాశాలు అంతే ఎక్కువగా ఉన్నాయి. పంట కోసే సమయంలో పొలాల్లో విద్యుత్ లైన్లు ఉంటాయి. హార్వెస్టర్లకు ఆ విద్యుత్ తీగలు తగిలి ప్రమాదాలు జరిగిన సంఘటనలు చాలానే ఉన్నాయి. ట్రాక్టర్లలో ధాన్యం తీసుకెళ్లే సమయంలో, గడ్డి కట్టలు తరలించేటప్పుడు విద్యుత్ తీగలు తగిలే అవకాశంఉంది.అజాగ్రత్తగా ఉంటే వాహనాలతోపాటు ప్రాణాలకు ప్రమాదం తప్పదని అధికారులు సూచిస్తున్నారు.

యజమానులు, డ్రైవర్లు జర భద్రం..

● యజమానులు హార్వెస్టర్ నడిపే డ్రైవర్, సహాయకుడిపై మొత్తం భారం వేసి నిర్లక్ష్యంగా ఉండవద్దు.

● కోతకు పొలంలోకి వెళ్లేటప్పుడు ఇరువైపులా దారి సక్రమంగా ఉందా లేదా అనేది చూసుకోవాలి.

● పొలాల్లో చాలాచోట్ల విద్యుత్ తీగలు ఉంటాయి. ముందుగానే గమనించి జాగ్రత్తలు పాటించాలి.

● విద్యుత్ స్తంభాలకు దూరం నుంచి హార్వెస్టర్‌ను నడపాలి

● పొలంలో విద్యుత్ తీగలుంటే ముందుగా సంబంధిత విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించి కోత పూర్తయ్యే వరకు సరఫరా నిలిపి వేయించాలి.



రైతులు జాగ్రత్తలు పాటించాలి..

ప్రమాదాలు జరగకుండా వరికోత మిషన్‌కు దాదాపు మీటరు దూరంగా ఉండి వరి దుబ్బులను మిషన్‌లో వేయాలి.

● వరి కోత మిషన్ నడుస్తున్నప్పుడు దూరంగా ఉండాలి. దాని నుంచి గడ్డి వేగంతో వస్తుంది. వరికోత మిషన్ ఎత్తులో ఉండడం ద్వారా దాని చుట్టూ ఉండే పరిసర ప్రాంతాలు చూడడం కష్టంగా ఉంటుంది. హార్వెస్టర్ నడిచే పరిసరప్రాంతాలకు దూరంగా ఉండడం ఉత్తమం,

రైతులు అప్రమత్తంగా ఉండాలి..

కూలీల కొరతతో రైతులు యంత్రాల వైపు మొగ్గు చూపుతున్నారు. హార్వెస్టర్లతో నూర్పిళ్లు వేగంగా పూర్తవుతున్నాయి. కానీ, ఏమాత్రం నిర్లక్ష్యం వహించిన ప్రమాదాలకు చోటిచ్చిన వాళ్లవుతారు. కొన్నిచోట్ల భూమి తడిగా ఉండడంతో పొలం కోసే సమయంలో వరి కోత యంత్రాలు దిగబడే అవకాశం ఉంటుంది. కాబట్టి జాగ్రత్తలు పాటించాలి. చేతులతో వరి దుబ్బులు వేసే టప్పుడు అప్రమత్తంగా ఉండాలి. రైతులు, హార్వెస్టర్ యజమానులు, డ్రైవర్లు ప్రమాదాల బారిన పడకుండా చూసుకోవాలి.

ఒలింపిక్స్ లక్ష్యంగా క్రీడలకు ప్రాధాన్యం

- సోదరభావంతో క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలి
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

వైరా నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన భారతదేశానికి ఒలింపిక్స్‌లో సరైన స్థానం తీసుకురావడం కోసం ప్రత్యేక ప్రణాళికతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకుపోతుందని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం వైరా సాంఘిక సంక్షేమ బాలికల గురుకులంలో పదో జోనల్‌స్థాయి జోనల్ స్పోర్ట్స్‌మీట్‌ను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యంలో క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఉంటుందని విద్యార్థులు ఆ అవకాశాల్ని ఉపయోగించుకొని ప్రతిభను నిరూపించుకోవాలని సూచించారు. నాలుగురోజులపాటు జరిగే జోనల్‌స్థాయి క్రీడల్లో విద్యార్థులు సోదరభావంతో క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని ఉద్బోధించారు. సంక్షేమ గురుకులాలు భవిష్యత్తులో ఇంటిగ్రేటెడ్ గురుకులాలుగా మరింత నాణ్యమైన, విద్యార్థికి అవసరమైన నైపుణ్యాల్ని అందిస్తామన్నారు. గురుకులంలోని ప్రతీ విద్యార్థి చదువుతోపాటు సర్వతోముఖాభివృద్ధికి అవసరమైన క్రీడలు, సాంస్కృతిక నైపుణ్యాలను పెంపొందించేందుకు కృషిచేస్తామన్నారు.

నాల్గవ జోన్ జోనల్ ఆఫీసర్ కొప్పుల స్వరూపరాణి అధ్యక్షతన జరిగిన ఈ ప్రారంభ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జాయింట్ సెక్రటరీ కంభంపాటి శారద గురుకుల క్రీడాప్రతిభను వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా గురుకులాల్లో విద్యార్థులు సాధించిన జాతీయ, అంతర్జాతీయ ప్రతిభ పాటవాలను మంత్రికి వివరించారు. విశిష్ట అతిథిగా హాజరైన వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాసునాయక్ మాట్లాడుతూ వైరా నియోజకవర్గాన్ని క్రీడల్లో ముందుకు తీసుకుపోవడానికి ముఖ్యమంత్రి, మంత్రి పొంగులేటి సహకారంతో ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకున్నట్లు తెలిపారు. విద్య, వైద్యంతోపాటు క్రీడల్లోనూ సమప్రాధాన్యత ఇస్తూ ప్రతిభచూపే విద్యార్థులను క్రీడాకారులను ఒలింపిక్స్ లక్ష్యంగా తీసుకుపోవడంలో ముందుంటానని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ముందుగా జోనల్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభసూచికగా జాతీయ జెండా, ఒలింపిక్స్ జోనల్ క్రీడా పతాకాలను మంత్రి, ఎమ్మెల్యే, కలెక్టర్ ఎగురవేశారు. అనంతరం క్రీడాజ్యోతిని వెలిగించి విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన గౌరవ వందన మార్చ్‌ఫాస్ట్ కొనసాగించారు. అనంతరం జోనల్ స్పోర్ట్స్ మీట్ వివరాలు ఇన్‌చార్జ్ కె.శ్రీదేవి క్రీడా వేదికకు పరిచయంచేశారు. వైరా బాలికల గురుకుల విద్యార్థినుల స్వాగత నృత్యం పలువురిని అలరించింది. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆర్డీవో నరసింహారావు, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, మండల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకట నర్సిరెడ్డి, ఏదునూరి సీతారాములు, ఆత్మాకమిటీ చైర్మన్ కోసూరి శ్రీనివాసరావు, సంక్షేమ గురుకులాల జాయింట్ సెక్రటరీ కంభంపాటి శారద, జోనల్ ఆఫీసర్ కొప్పుల స్వరూపరాణి, స్థానిక ప్రిన్సిపాల్ డి.సమత, గురుకుల ప్రిన్సిపాల్ చావా జ్యోతి, ఎం.పద్మావతి, పీవి పద్మావతి, మీసాల సునీత, జ్యోతిలిల్లీ, విజయ దుర్గ, విజయకుమారి, మైథిలి, ఎం.స్వరూపరాణి, ఐనాల సైదులు, రామయ్య, బక్కనాగేశ్వరరావు, కుసుమ, శివకుమారి, విజయనిర్మల తదితరులు పాల్గొన్నారు. కాగా, ఈనెల 14వరకు జరిగే క్రీడల్లో 10వ జోన్‌లోని 14 గురుకులాలకు చెందిన 1190 మంది విద్యార్థినులు పాల్గొంటున్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, హ్యాండ్‌బాల్, టెన్నీకాయిట్, చెస్, క్యారమ్స్‌తోపాటు అథ్లెటిక్స్ అండర్ 14, 17, 19 విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు.



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

పదేళ్ల పాలనలో దోచుకున్నారు..

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మంరూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదని, అప్పులు కడుతున్నా.. సంక్షేమ పథకాలు ఎక్కడా ఆపడం లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మంరూరల్ మండలం, వెంకటగిరి గ్రామంలో సోమవారం కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి మాట్లాడారు. రాష్ట్రంలో 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కృషి చేస్తున్నామని అన్నారు. రైతుల కళ్లల్లో ఆనందం చూడాలని రూ.18 వేల కోట్ల రుణమాఫీ చేసినట్లు తెలిపారు. గత పదేళ్లలో సొంత ఇల్లు కలగానే మిగిలిందన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం విద్యకు, వైద్యానికి పెద్దపీట వేస్తుందన్నారు. విద్యలో అనేక సంస్కరణలు చేశామన్నారు. రూ.657 కోట్లతో పాఠశాలలు అభివృద్ధి చేశామన్నారు. రాష్ట్రం ఏర్పడిన పది సంవత్సరాలలో రాష్ట్ర ప్రజల రక్తాన్ని పీల్చారని ఆరోపించారు. వారు అధికారంలో ఉన్నప్పుడు దొర పోకడ పోయారని విమర్శించారు. పేదలను ఇబ్బందులు పెడితే తమ ప్రభుత్వం చూస్తూ ఊరుకోదన్నారు. దొరల పదేళ్ల పాలనలో ఒక్కొక్కటి ప్రజల ముందు పెడితే అంతరిక్షంలో దాక్కుంటరేమోనని విమర్శించారు. పేదవారికి చెందాల్సిన ఆస్తిని కొల్లగొట్టిన వారు ఎంత పెద్ద దొరలైనా చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందన్నారు.

ఫోన్ ట్యాపింగ్ అనేది చిన్న విషయం కాదని, చేతిలో పాలన ఉందని అరాచకం చేశారని నాటి బీఆర్ఎస్ సర్కారును ఉద్దేశిస్తూ విమర్శించారు. అన్నీ త్వరలో బయటకు వస్తాయన్నారు. తప్పు చేసిన వారిని కచ్చితంగా చట్టం శిక్షిస్తుందన్నారు. పార్టీ నాయకులు జారి పోతారేమోనని, వారిని మభ్య పెడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, రాష్ట్ర మహిళా కార్పొరేషన్ మాజీ చైర్మన్ మద్దినేని స్వర్ణకుమారి, మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టులు అభివృద్ధి నిరోధకులు

(5వ పేజీ తరువాయి)

సమన్వయం పాటిస్తూ పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కాలం చెల్లిన సిద్ధాంతాలతో అమాయకమైన ఆదివాసీలను అభివృద్ధికి, సంక్షమానికి దూరం చేస్తూ నిషేధిత మావోయిస్టు పార్టీ అగ్రనాయకులు తమ పబ్బం గడుపుకుంటున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెలంగాణలోని ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే ఆదివాసీ ప్రజలకు విద్య, వైద్యం, రవాణా, ఇతర సంక్షేమ పథకాలు అందించడానికి కృషి చేస్తున్నాయని అన్నారు. కానీ మావోయిస్టు పార్టీకి చెందిన అగ్ర నాయకులు తమ ఉనికిని చాటుకోవడానికి ఏజెన్సీ ప్రాంతాల్లోని ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకుంటూ దుశ్చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. సమావేశం అనంతరం డిజిపితో పాటు సమావేశంలో పాల్గొన్న అధికారులు భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకున్నారు. సమావేశంలో భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, భూపాలపల్లి ఎస్పీలు రోహిత్‌రాజు, డాక్టర్ శబరీస్, కిరణ్ ఖరే, గ్రేహౌండ్స్ ఎస్పీ రాఘవేందర్ రెడ్డి, ట్రైనీ ఐపీఎస్‌లు, సీఆర్‌పీఎఫ్ అధికారులు పాల్గొన్నారు.

రూ.66.35 కోట్లతో 'మంచుకొండ ఎత్తిపోతల'

(5వ పేజీ తరువాయి)

ఇవ్వాల్సి ఉందని తెలిపారు. రూ.2లక్షలపైగా ఉన్న రుణాలున్నవారు 13 లక్షలపైగా ఉంటారని, వారికి త్వరలో షెడ్యూల్ ప్రకటిస్తామని తెలిపారు. వీరికి మరో రూ.10వేల కోట్ల వరకు రుణమాఫీ చేయాల్సి ఉంటుందన్నారు. మొత్తంగా రూ.31వేల కోట్లు రైతు రుణమాఫీ చేసి తీరుతామన్నారు.

గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం 40లక్షల మంది రైతులకు రూ.లక్ష రుణమాఫీ చేస్తామని ప్రకటించి 20 లక్షలమంది రైతులకే మాఫీ చేసిందన్నారు. ఆ మిగిలిన రైతులకు కూడా తాము రుణమాఫీ చేయాల్సి వచ్చిందన్నారు. గత ప్రభుత్వం ఎన్నికల ముందు ఎగ్గొట్టిన రైతుబంధును కూడా తమ ప్రభుత్వం ఇచ్చిందన్నారు. రైతుబీమాకు రూ.2,700కోట్లు చెల్లించామన్నారు. రైతులకు పంట నష్టానికి ఎకరానికి రూ.10వేల పరిహారం కూడా ఇచ్చామన్నారు. రైతులకు పంటల నష్టం జరిగినా ఇతర కారణాలతో నష్టం జరిగినా ఇన్సూరెన్స్ ద్వారా పరిహారం లభించేలా రాష్ట్ర ప్రభుత్వమే ప్రీమియం చెల్లించిందని తెలిపారు. వారంరోజుల్లో దీనిపై చర్చించి టెండర్లు కూడా పిలుస్తామన్నారు.

దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తమ ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం కృషిచేస్తుంటే కేంద్ర ప్రభుత్వం తమవంతు సహకారం అందించకుండా విమర్శలు చేయడం తగదన్నారు రాష్ట్రంలోని విపక్షపార్టీలు చిల్లర వేషాలు, డ్రామాలు చేస్తూ తప్పుడు విమర్శలు చేస్తున్నాయన్నారు. తమ ప్రభుత్వ పని తీరును చూసి ప్రతిపక్షాలు అప్పుడే అత్రుతతో కన్నీరు కార్చొద్దని, అప్పుడే కన్నీళ్లు అయిపోతే ఇంకా నాలుగేళ్లు ఏడవడానికి కన్నీళ్లు మిగలవని ప్రతిపక్షాలను ఉద్దేశించి మంత్రి తుమ్మల వ్యాఖ్యానించారు. విలేకరుల సమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఖమ్మం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మౌలానా అబ్దుల్‌కలాం ఆజాద్ జయంతి వేడుకలు

కొత్తగూడెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): భారతరత్న పురస్కారగ్రహిత, కేంద్ర తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబ్దుల్ కలాంఆజాద్ 136వ జయంతి వేడుకలను జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు కలెక్టర్ జితేష్ వి పాటిల్ ముఖ్య అతిథిగా పాల్గొని మౌలాని అబ్దుల్‌కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ విద్యా వ్యవస్థను తీర్చిదిద్దిన వ్యక్తి పరిపాలన దక్షకుడు మౌలాని అబ్దుల్‌కలాం ఆజాద్ అని అన్నారు. 11 ఏళ్ల విద్యాశాఖ మంత్రిగా ఆజాద్ ఎనలేని సేవలు అందించి, జాతీయ విద్యా విధానం అమలు చేశారన్నారు. ఆయన చేసిన సేవలకు గుర్తింపు కానీ ఏటా 11వ తేదీన జాతీయ విద్య దినోత్సవం నిర్వహిస్తున్నట్లు వివరించారు. స్వాతంత్రోద్యమంలో పాల్గొన్న మైనార్టీ వర్గాల్లో మౌలానా అబ్దుల్‌కలాం ఆజాద్ అగ్రస్థానంలో నిలుస్తారన్నారు. రచయితగా, కవితగా, తత్వవేత్తగా, విద్యావేత్తగా, రాజకీయ వేత్తగా అనేక సేవలు అందించారని, ఆజాద్ మైనార్టీ అభ్యున్నతికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జిల్లా మైనార్టీ సంక్షేమశాఖాధికారి సంజీవరావు, జిల్లా అధికారులు, మైనార్టీ సంఘ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

ఖమ్మం రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ రైతు మృతి చెందిన సంఘటన ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోలిశెట్టిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని డాక్యాతండా గ్రామానికి చెందిన మాలోతు భద్రాజి(45) తాను సాగుచేసి మిర్చి తోట ఇటీవల వచ్చిన తుఫాను, వరదలకు పూర్తిగా దెబ్బతిన్నది. సుమారు రూ. 3 లక్షల నష్టం వచ్చింది. దీంతో మనస్తాపం చెందిన రైతు ఈనెల 10వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతు సోమవారం మృతిచెందాడు.

బైక్‌ను ఢీకొన్న లారీ.. ఒకరి మృతి

ఖమ్మం రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాన్ని ఓ లారీ ఢీ కొట్టడంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. తిరుమలాయపాలెం మండలం, రఘునాథపాలేనికి చెందిన అంగడి ఉపేందర్ (24)శ్రీకాంత్ ఇద్దరు కలిసి ద్విచక్రవాహనంపై ఖమ్మం వెళ్తున్నారు. మధ్యలో గొల్లగూడెం వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఉపేందర్‌కి తీవ్ర గాయాలు అయ్యాయి. శ్రీకాంత్‌కి స్వల్పగాయాలు అయ్యాయి. వారిని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఉపేందర్ చికిత్స పొందుతూ మృతిచెందాడు.

ఉత్సాహంగా భద్రాద్రి జోన్ బాలుర స్పోర్ట్స్ మీట్

- మరిపెడలో ప్రారంభించిన ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్

మరిపెడ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా మరిపెడలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో సోమవారం భద్రాద్రి 10వ జోన్ స్పోర్ట్స్ మీట్ పోటీలు అదరహో అనిపించాయి. విద్యార్థుల సంబరాలు అంబరాన్ని అంటాయి. ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ ఈ పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి, క్రీడాజ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక సోషల్ వెల్ఫేర్ విద్యార్థులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. భద్రాద్రి ఫోర్త్ జోన్ పరిధిలోని కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల పరిధిలోని 11 గురుకుల పాఠశాలలకు చెందిన 935 మంది విద్యార్థులు వివిధ పోటీల్లో పాల్గొని తొలి రోజు తమ ప్రతిభను చాటారు. వర్ధన్నపేట గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు యోగా ఆసనాలతో అదరగొట్టారు. తొలి రోజు స్పోర్ట్స్ మీట్‌లో విద్యార్థులు హుషారుగా పాల్గొన్నారు.

11 రకాల ఆటల పోటీలు

ఈ స్పోర్ట్స్ మీట్ సందర్భంగా 11 రకాల ఆటల పోటీలకు మరిపెడ సోషల్ వెల్ఫేర్ స్కూల్ వేదికగా నిలిచింది. అండర్-14, 17, 19 విభాగాలలో పోటీలను నిర్వహిస్తున్నారు. కబడ్డీ, ఖోఖో, బాల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, చెస్, క్యారమ్స్, లాంగ్‌జంప్, హైజంప్, రన్నింగ్ తదితర పోటీలను నిర్వహిస్తున్నారు. ఒక్కొక్క పాఠశాల నుంచి 85మంది విద్యార్థుల చొప్పున 11 గురుకుల పాఠశాలల నుంచి మొత్తం 935 మంది విద్యార్థులు పాల్గొంటున్నారు.

తొలి రోజు 600 మీటర్స్ రన్నింగ్, 5కే రన్, లాంగ్‌జంప్ పోటీలు నిర్వహించారు. 600 మీటర్ల అండర్-14 విభాగంలో నితిన్(మణుగూరు), సీహెచ్.రిషి(మరిపెడ), జి.గణేశ్(దమ్మపేట) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు దక్కించుకున్నారు. 5కే రన్ అండర్-17లో జె.గౌతమ్(దమ్మపేట), కె.రవితేజ(దమ్మపేట), కె.మణికాంత్(సత్తుపల్లి), అండర్-19 విభాగంలో బి.దిలీప్(పాల్వంచ), జీఎల్‌కే మదన్‌సాయి(పాల్వంచ), కె.ప్రతాప్(నర్సంపేట), లాంగ్‌జంప్ అండర్-14, 17, 19 విభాగంలో ఎస్.శ్రీకాంత్(పాల్వంచ), కె.గౌతమ్(పాల్వంచ), ఎం.నితిన్(మణుగూరు), కె.ఆనంద్(ఏఆర్‌పల్లి), జి.అభినయ్(పాల్వంచ), బి.మోహన్(టి.పాలెం), ఎం.శ్రీరామ్(దమ్మపేట), ఎం.కాంతి (టి.పాలెం), జి.శశిధర్(మరిపెడ) ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు.


యోగాసనాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

క్రైం సమాచారం

1,160 కిలోల గంజాయి దహనం



గంజాయిని పరిశీలిస్తున్న అధికారులు

భద్రాచలం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం ఎక్సైజు స్టేషన్ పరిధిలో 35 కేసుల్లో పట్టుబడిన 1,160 కిలోల గంజాయిని తల్లాడ మండలం గోపాల్‌పేట్‌లో సోమవారం దహనం చేసినట్లు ఎక్సైజు అధికారులు తెలిపారు. ఈ గంజాయిని ఎక్సైజు శాఖ ఎన్‌ఫోర్సుమెంటు డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి ఆదేశాల మేరకు దహనం చేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

అశ్వారావుపేట, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): అశ్వారావుపే పట్టణ సమీపంలో సోమవారం అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ యయాతిరాజు తెలిపారు. అనతారం నుంచి అశ్వారావుపేటకు ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న గుంజి రమణకు చెందిన ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పాముకాటుకు రైతు బలి

కారేపల్లి నవంబరు11, (ఆంధ్రజ్యోతి): పొలం వద్దకు వెళ్లిన రైతు పోడుగు బుచ్చిరాములు(46)ను పాము కాటువేయడంతో మృతిచెందిన సంఘటన సోమవారం మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబసభ్యుల కథనం ప్రకారం బుచ్చిరాములు గ్రామసమీపంలోని ఉన్న పొలంవద్దకు వెళ్లి పంటకు నీళ్లుపెట్టి ఇంటికి వచ్చాడు. దాహంగా ఉండటంతో మంచినీళ్లు తాగాడు. ఇంటికి వచ్చిన సర్వే ఎన్యూరేటరతో మాట్లాడాడు. అంతలోనే నోట్లో నుంచి నురుగులు వస్తూ కింద పడిపోయాడు. ఇది గమనించిన కుటంబసభ్యులు ఇల్లెందు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే బుచ్చిరాములు మృతిచెందిన్నట్లు వైద్యులు తెలిపారు. అయితే పొలం వద్దకు వెళ్లిన బుచ్చిరాములును పాము కాటువేసిన్నట్లు గుర్తించారు. మృతుడు బుచ్చిరాములుకు భార్య హైమవతి, కుమారుడు వరుణ్, కుమార్తె వసుంధర ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

సత్తుపల్లిరూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఆంధ్రాకు ట్రాలీ వాహనంలో తరలిస్తున్న పీడీఎస్ రేషన్ బియ్యాన్ని పోలీసులు దాడిచేసి పట్టుకున్నారు. ఎస్ఐ తోట నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గౌరిగూడెం పరిసర ప్రాంతాలలో సేకరించిన రేషన్ బియ్యం వాహనంలో నింపుకొని ఆంధ్రాలో విక్రయించేందుకు వెళ్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు దాడిచేశారు. ఈ దాడిలో బాలాజీ, రాంబాబులను అదుపులోకి తీసుకోగా మరో ముగ్గురు పరారవ్వగా 6క్వింటాళ్ల రేషన్ బియ్యంతో పాటు ట్రాలీ వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామన్నారు.

అక్రమ కలప స్వాధీనం

అశ్వాపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): వాహనంలో అక్రమంగా తరలిస్తున్న కలపను అశ్వాపురం ఫారెస్ట్ అధికారులు సోమవారం తెల్లవారుజామున పట్టుకున్నారు. సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.. పక్కా సమాచారం మేరకు అశ్వాపురం ఫారెస్ట్ అధికారులు తెల్లవారుజామున అశ్వాపురంలో నిఘా ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా అశ్వాపురంనుంచి టాటాఏసి వాహనంలో కొందరు అక్రమకలప తరలిస్తుండగా అధికారులు పట్టుకుని ఫారెస్ట్ రేంజ్ కార్యాలయానికి తరలించారు. ఈసందర్భంగా వాహనంలో రూ.80వేల విలువచేసే కలప ఉన్నట్లు గుర్తించారు. ఎటువంటి అనుమతి పత్రాలు లేకపోవటంతో వాహనంతో పాటు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసునమోదు చేసినట్లు రేంజర్ రమేష్ తెలిపారు.

ఏకలవ్య విద్యార్థిని నిమ్స్‌కు తరలింపు

దుమ్ముగూడెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యాయత్నం చేసి భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్న లక్ష్మీనగరం ఏకలవ్య పాఠశాల ప్లస్‌టు విద్యార్థిని మట్టా ధనలక్ష్మిని సోమవారం హైదరాబాదు నిమ్స్‌కు తరలించారు. ప్రవర్తన సరిగా లేదంటూ ప్రిన్సిపాల్ పాఠశాల నుంచి ధనలక్ష్మిని ఈనెల 8న ఇంటికి పంపారు. మనస్తాపం చెందిన విద్యార్థిని పెదనల్లబల్లిలోని తన ఇంటి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. భద్రాచలం ఏరియా ఆసుపత్రి ఐసీయూలో చికిత్సలు పొందుతున్నా పరిస్థితి మెరుగు పడకపోవడంతో ప్రిన్సిపాల్ దగ్గరుండి ఆమెను నిమ్స్‌కు తరలించారు. దీనికి బాధ్యులైన ఆర్‌సీఓపై చర్యలు తీసుకొని, ప్రిన్సిపాల్, వార్డెన్‌లను సస్పెండ్ చేయాలని ఆదివాసీ సంఘం నాయకులు కణితి సమ్మయ్య, కోడి చంటి డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ నాయకుడు నల్లాని మృతి

నేలకొండపల్లి, నవంబరు11(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నాయకుడు, రియల్టర్, పైనంపల్లి గ్రామానికి చెందిన నల్లాని మాధవరావు(54) సోమవారం తెల్లవారురుజామున గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు. నల్లాని మృతి సమాచారం తెలుసుకున్న కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నివాళులర్పించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, తుంబూరు దయాకర్‌రెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ వెన్నపూసల సీతారాములు, పెదనాటి వెంకటేశ్వర్లు, శాఖమూరి రమేష్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నం బ్రహ్మయ్య డాక్టర్ నాగుబండి శ్రీనివాసరావు తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే హుస్సేన్ సతీమణి మృతి



నేలకొండపల్లి, నవంబరు11(ఆంధ్రజ్యోతి): 1978లో పాలేరు నియోజకవర్గం నుంచి ఇందిరా కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిచిన బోదులబండ గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యే పొట్టపింజర హుస్సేన్ సతీమణి పొట్టపింజర ముత్తమ్మ(85) సోమవారం మృతి చెందారు. ముత్తమ్మకు నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. ముత్తమ్మ మృతి సమాచారం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు ముత్తమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. రాయల నాగేశ్వరరావు, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కట్టెకోల నాగేశ్వరరావు, బచ్చలకూరి నాగరాజు, ఎమ్మార్పీఎస్ నాయకులు వంగూరి ఆనందరావు, పగిడికత్తుల ఈదయ్య తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. కాగా హుస్సేన్ 1981లోనే కన్నుమూశారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

ఖమ్మంక్రైం, నవంబరు11(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని అదృశ్యం కావడంతో కుటుంబసభ్యులు నగరంలోని ఖానాపురంహవేలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కారేపల్లి మండలానికి చెందిన విద్యార్థిని నగరంలోని ఒక ప్రైవేటు కళాశాలలో ఇంటర్ రెండో ఏడాది హాస్టల్‌లో ఉంటూ చదువుతోంది. ఆరోగ్యం సరిగా లేకపోవడంతో దీపావళి పండగకు ఇంటికి తీసుకెళ్లగా ఆసుపత్రిలో చికిత్స చేయించి ఆదివారం మధ్యాహ్నం సమయంలో హాస్టల్‌లో చేర్చి తండ్రి ఇంటికి వెళ్లాడు. అదే రోజు సాయంత్రం 4గంటల సమయంలో తన కూతురు హాస్టల్‌లో కనిపించడంలేదని హాస్టల్ సిబ్బంది ఫోన్‌చేసి చెప్పారు. దీంతో పలుచోట్ల వెతికినా ఆచూకి లభించకపోవడంతో తండ్రి పోలీసులకు ఫిర్యాదుచేశాడు. ఈమేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా తనకుమార్తె అదృశ్యానికి కారణం కళాశాల సిబ్బంది నిర్లక్ష్యమే కారణం అంటూ తండ్రి ఆరోపిస్తున్నాడు.



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

విద్యతో పేదరికం నుంచి శాశ్వత విముక్తి

- వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం ఖానాపురంహవేలి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్య ద్వారానే పేదరికం నుంచి శాశ్వత విముక్తి లభిస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం మంత్రి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తో కలిసి ఖమ్మంలోని తెలంగాణ అల్ప సంఖ్యాకుల గురుకుల విద్యా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన మైనారిటీ సంక్షేమ దినోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, మైనారిటీ వర్గాలలో ఆడ పిల్లలను బడికి పంపించాలంటే ఇబ్బంది పడే రోజుల నుంచి పిల్లలను చదివిస్తే తప్ప భవిష్యత్తు ఉండదు అని భావించే వరకు వచ్చారని అన్నారు. గతంలో ప్రభుత్వాలు డైట్ చార్జీలు పెంచకపోవడం వల్ల కొంత ఇబ్బందిగా ఉండేదని, దీనిని గమనించి ప్రభుత్వం డైట్ చార్జీలు, కాస్మెటిక్ చార్జీలను పెంచిందని అన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

పేద విద్యార్థులకు సంక్షేమ పథకాలు

- రెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మం ఖానాపురంహవేలి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం చేపడుతున్న అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నదని రెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మం రాపర్తినగర్ తెలంగాణ మైనారిటీ గురుకుల కళాశాల(బాలికల)లో సోమవారం నిర్వహించిన దేశ మొదటి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలకు కావాల్సిన ప్రొజెక్టర్‌ను వారంలోగా సమకూరుస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులకు చదువు ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఒకటవ డివిజన్ డివిజన్ కార్పొరేటర్ హుస్సేన్, 2టౌన్ సీఐ బాలకృష్ణ, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అనంతరాములు, ప్రిన్సిపాల్ అఖిల, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో

అప్రమత్తంగా ఉండాలి

- వరంగల్ మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి



ఏడూళ్లబయ్యారం పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఐజీ చంద్రశేఖర్ రెడ్డి

పినపాక, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రభావిత ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని వరంగల్ మల్టీజోన్ 1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి సూచించారు. సోమవారం పినపాక మండలంలోని ఏడూళ్లబయ్యారం పోలీస్ స్టేషన్‌ను ఐజీ చంద్రశేఖర్ రెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పని చేసే పోలీస్ అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, గోదావరి పరివాహక ప్రాంతాలలో నిఘా పెంచాలని ఆదేశించారు. ఏజెన్సీ గ్రామాల్లో కమ్యూనిటీ పోలీసింగ్‌ను ప్రోత్సహించాలని, గ్రామాల్లోని యువతను చదువు, క్రీడలు, కెరీర్, ఉపాధి కల్పన దిశగా ప్రోత్సహించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాల వైపు యువత వెళ్లకుండా, పోలీసులు చత్తీస్‌గఢ్ వలస గ్రామాలపై పోలీసులు నిఘా పెంచాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారని కితాబిచ్చి, సీఐ వి. వెంకటేశ్వరరావు, ఎస్ఐ ఇమ్మడి రాజ్‌కుమార్‌లను ఐజీ అభినందించారు.

కరాటేలో శంకర్‌కు గోల్డ్ మెడల్



దమ్మపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గోవాలో ఆదివారం జరిగిన ఇంటర్‌నేషనల్ కరాటే చాంపియన్ షిప్‌లో మందలపల్లికి చెందిన గొంది శివశంకర్ గోల్డ్‌మెడల్ సాధించాడు. 24వ ఎఫ్.ఎస్.కే.ఏ ప్రపంచ కప్ కరాటే పోటీలు ఈనెల 7నుంచి 10 తేదీ వరకు గోవా రాష్ట్రంలోని మఫ్‌సాలో నిర్వహించారు. పోటీల్లో 40దేశాలకు చెందిన వారు పాల్గొన్నారు.

ఈహెచ్ఐఎంఎస్ సేవలకు భద్రాద్రి ఎంపిక



డీఎంహెచ్‌వోతో సమావేశమైన ఈహెచ్ఐఎంఎస్ అధికారులు

చుంచుపల్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో ఆరోగ్య సేవలను మెరుగు పరచడానికి, ఆరోగ్యశ్రీ నుంచి అందించే వైద్య సేవలను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేయడానికి పైలెట్ ప్రాజెక్ట్‌గా భద్రాద్రి కొత్తగూడెం, సంగారెడ్డి జిల్లాలను ఎంపిక చేశారు. సోమవారం డిప్యూటీ ఆరోగ్యశ్రీ డైరెక్టర్ కార్తీక్‌రెడ్డి, ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ డాక్టర్ మాధవరావు, భద్రాద్రి జిల్లా కలెక్టరేట్ సముదాయంలోని జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయంలో డీఎంహెచ్‌వో భాస్కర్‌నాయక్ తో సమావేశమయ్యారు. జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల పరిధిలో ఎలక్ట్రానిక్ హెల్త్ మేనేజ్మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ అమలు చేయాలని, గిరిజన గ్రామాల్లోని ప్రజలకు ఆరోగ్య శ్రీ సేవలను ఆన్‌లైన్ ద్వారా ఎలా పొందాలో వివరించారు.



లక్ష గాజులతో అమ్మవారి అలంకరణ

తల్లాడ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తల్లాడలోని ముత్యాలమ్మ ఆలయంలో సోమవారం రాత్రి లక్ష గాజులతో అమ్మవారిని అలంకరించారు. ఈ సందర్భంగా అర్చకుడు సతీష్‌శర్మ ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

కలకోట-మోటమర్రి రోడ్డు విస్తరణ పనులకు

రూ. 30 కోట్ల నిధుల మంజూరు

- ప్రజల చిరకాల వాంఛ నేరవేర్చిన డిప్యూటీ సీఎం భట్టి

బోనకల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కలకోట గ్రామం నుంచి మోటమర్రి వరకు గల ఎనిమిది కిలోమీటర్ల రహదారి విస్తరణ పనులకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క రూ. 30 కోట్ల నిధులను మంజూరు చేశారు. కలకోట, రాయనపేట, ఆళ్లపాడు, మోటమర్రి, గోవిందాపురం(ఎ) గ్రామాల ప్రజలు ఈ మార్గం గుండా నిత్యం మధిరకు రాకపోకలు సాగిస్తుంటారు. మోటమర్రి రైల్వే స్టేషన్ వద్ద మూడవ రైల్వే ట్రాక్ పనులు జరుగుతుండటంతో అధిక లోడ్‌తో కంకర, గ్రావెల్ తోలకాలు జరుపుతున్న లారీల రద్దీ వలన రోడ్డంతా దెబ్బతింది. ఈ సమస్య పై 'ఆంధ్రజ్యోతి'లో కూడా కథనం ప్రచురితమైంది. దీనికి తోడు రోడ్డు విస్తరణ చేస్తే ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని, నిధులు మంజూరు చేయాలని పీసీసీ సభ్యులు పైడిపల్లి కిషోర్ కుమార్, సొసైటీ ఛైర్మన్ కర్నాటీ రామకోటేశ్వరరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు గాలి దుర్గారావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు మోదుగు సుదీర్‌బాబులు డిప్యూటీ సీఎం మల్లు భట్టీ విక్రమార్కను కలిసి సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన వెంటనే రోడ్డు విస్తరణ పనులకు నిధులు మంజూరు చేశారు. ప్రజల చిరకాల వాంఛగా ఉన్న రోడ్డు విస్తరణకు నిధులు మంజూరు చేసినందుకు గానూ భట్టికి కాంగ్రెస్ నాయకులతో పాటు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.



రామాలయంలో డీజీపీ, డీజీతో పాటు ఐపీఎస్ అధికారులు

రామయ్య సేవలో డీజీపీ జితేందర్

భద్రాచలం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారిని డీజీపీ జితేందర్, ఇంటిలిజెన్స్ డీజీ శివధర్‌రెడ్డితో పాటు పలువురు ఐపీఎస్ అధికారులు విక్రమ్ ఠాకూర్, రుత్విక్ రుద్ర, చారుసిన్హా దర్శించుకున్నారు. వీరికి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి ఆధ్వర్యంలో ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయం, దాసాంజనేయస్వామి వారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు డీజీపీ జితేందర్‌తో పాటు, ఇతర ఐపీఎస్ అధికారులకు వేద ఆశీర్వచనం అందజేశారు. వీరి వెంట జిల్లా ఎస్పీ రోహిత్‌రాజుతో పాటు ములు ఎస్పీ శబరీష్, భూపాలపల్లి జిల్లా ఎస్పీ కారే కిరణ్ ప్రభాకర్, మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి ఉన్నారు. అనంతరం డీజీపీతో పాటు ఐపీఎస్ అధికారులు ఐటీసీ అతిథి గృహంకు బయలుదేరి వెళ్లారు.

డీజీపీని కలిసిన కలెక్టర్

బూర్గంపాడు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): బూర్గంపాడు మండల పరిధిదిలోని సారపాక ఐటీసీ గెస్ట్‌హౌస్‌లో సోమవారం డీజీపీ డాక్టర్ జితేందర్‌ను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ కలిసారు. రాష్ట్ర సరిహద్దుల అధికారులతో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో పాల్గొటానికి విచ్చేసిన డీజీపీని మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్ మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక పరిస్థితులపై చర్చించుకున్నారు.

ఎస్‌జీఎఫ్ అండర్- 14

వాలీబాల్ జట్టు ఎంపిక



వాలీబాల్ బాలికల జట్టు

ఖమ్మం స్పోర్ట్స్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఈనెల 16 నుంచి 18 వరకు మెదక్ జిల్లా చేగుంటలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనే జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) అండర్- 14 బాల, బాలికల వాలీబాల్ జట్లను సోమవారం నగరంలోని సర్ధార్‌పటేల్ స్టేడియంలో ఎంపిక చేశారు. ఎంపికలకు ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 120 మంది క్రీడాకారులు హాజరైనారు. ఈ సందర్భంగా ఎంపికల్లో ప్రతిభ చూపి క్రీడాకారులను జిల్లా జట్లకు ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రెటరీ నర్సింహమూర్తి తెలిపారు. ఎంపికలను వాలీబాల్ కోచ్ అక్బర్ అలీ, వ్యాయామ ఉపాధ్యాయులు బాలరాజు, నాగరాజు, గోపి, సైదేశ్వరరావు, షఫీక్ అహ్మద్, రాజకుమారి సమీక్షించారు.

రాష్ట్రస్థాయి యోగాలో నగర క్రీడాకారుల ప్రతిభ



పతకాలు సాధించిన వారితో యోగా కోచ్ కోదండరామ్

ఖమ్మం స్పోర్ట్స్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఈనెల 9, 10 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగిన 11వ తెలంగాణా రాష్ట్ర స్థాయి అంతర జిల్లాల యోగా పోటీల్లో నగరంలోని కరుణగిరి కేంద్రీయ విద్యాలయ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపి బహుమతులు సాధించారు. నిత్యం సిద్ధార్థ యోగా విద్యాలయంలో తర్ఫీదు పొందే నవదీప్ స్వర్ణ పతకం సాధించగా యశ్వంత్, లక్ష్మీప్రణీత్ కాంస్య పతకాలు సాధించారు. త్వరలో జార్ఖండ్ రాష్ట్రంలో జరిగే జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పతకం సాధించిన విద్యార్థులను యోగా శిక్షకుడు కోదండరామ్ అభినందించారు.

భద్రాద్రి షటిల్ బ్యాడ్మింటన్ కమిటీ నియామకం

- అభినందించిన శిక్షకుడు పుల్లెల గోపిచంద్



గోపిచంద్‌తో బ్యాడ్మింటన్ కమిటీ సభ్యులు

చుంచుపల్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నూతన షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు హైదరాబాద్‌లో జాతీయ శిక్షకుడు, ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చాంపియన్ పుల్లెల గోపిచంద్‌ను మర్యాద పూర్వకంగా సోమవారం కలిశారు. ఇటీవల గచ్చిబౌలీలోని పుల్లెల గోపిచంద్ అకాడమీలో రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎక్స్‌క్యూటీవ్ కమిటీలో పది కొత్త జిల్లాల అధ్యక్ష, నూతన కమిటీలను ప్రకటించారు. నూతన అధ్యక్షుడిగా ఎంపికైన ఇంటూరి రవికుమార్(పాల్వంచ), ఉపాధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు(భద్రాచలం), సెక్రటరీ డాక్టర్ కె.సావిత్రి(కొత్తగూడెం), జాయింట్ సెక్రటరీ పి.హరిప్రసన్నకుమార్(భద్రాచలం), ట్రెజరర్ కుంచాల రమేష్(భద్రాచలం), సభ్యులు ఇల్లటూరి రాజకుమార్‌తో 17 మంది గోపిచంద్‌ను కలిశారు.

బడుగు, బలహీనవర్గాల పార్టీ టీడీపీ

- టీడీపీ ఖమ్మం పార్లమెంటు కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం



సభలో మాట్లాడుతున్న డాక్టర్ వాసిరెడ్డి రామనాథం

నేలకొండపల్లి, నవంబరు11(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాలకు పెద్దపీట వేసి ఉన్నత పదవులను కట్టబెట్టిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని టీడీపీ ఖమ్మం పార్లమెంటు కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం అన్నారు. నేలకొండపల్లి మండలం రామచంద్రాపురంలో సోమవారం సాయంత్రం తెలుగుదేశం వ్యవస్థాపకుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహాన్ని రామనాథం ఆవిష్కరించారు. అనంతరం ఆరెకట్ల కొండలరావు అధ్యక్షతన జరిగిన సభలో రామనాథం మాట్లాడుతూ తెలుగు జాతి ఆత్మాభిమాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు ఎన్టీఆర్ అన్నారు. ఎన్టీఆర్ రాజకీయ రంగ ప్రవేశంతోనే రాజకీయాల్లో పెనుమార్పులు వచ్చాయన్నారు. ఎన్టీఆర్ విగ్రహావిష్కరణను పురస్కరించుకుని తొలుత గ్రామంలో తెలుగుదేశం కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఆరెకట్ల కొండలరావు, పార్టీ మాజీ రాష్ట్ర కార్యదర్శి కనగాల సాంబశివరావు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ సూరపనేని రామకృష్ణ, నలమాస మల్లయ్య, దుడ్డెల గోపాలరావు, బడేమియా, మందపల్లి రజని, గడిపూడి వెంకటేశ్వరరావు, ఖమ్మం రూరల్, కూసుమంచి, అశ్వారావుపేట, బోనకల్ మండలాల పార్టీ అధ్యక్షులు, వైరా, అశ్వారావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జిలు, కొండబాల కరుణాకర్, గోగినేని సీతారాం, కోలేటి మస్తాన్, అక్కినేని నాగేశ్వరరావు, మద్దినేని మహేష్‌లతో పాటుగా పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

నేడు సింగరేణికి ఎస్సీ, ఎస్టీ కమిషన్ రాక

రుద్రంపూర్ (సింగరేణి), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ప్రధాన కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మంగళవారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకయ్యతోపాటు కమిటీసభ్యులు హాజరుకానున్నారు. ఛైర్మన్ బక్కి వెంకయ్యతోపాటు సింగరేణి సీఎండీ డైరెక్టర్ ఎన్. బలరాం, కమీషన్ సభ్యులు నీలాదేవి, రాంబాబునాయక్, కొంకటి లక్ష్మీనారాయణ, జే. శంకర్, రేణుకుంట్ల ప్రవీణ్, సింగరేణి డైరెక్టర్లు బి. సత్యనారాయణరాజ్, జి. వెంకటేశ్వరరెడ్డి, జనరల్ మేనేజర్లు కవితానాయుడు, దుర్గం రాంచందర్, ఈసం కృష్ణయ్య, రాజేశ్వరరావు, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అంతోటి నాగేశ్వరరావు, భూక్యా నాగేశ్వరరావు హాజరుకానున్నట్లు జనరల్ మేనేజర్ మనోహర్, డీజీఎం అజేయ్‌కుమార్‌లు సోమవారం తెలిపారు.

తొలి బయోమైనింగ్ కేంద్రం ప్రారంభం

ఇల్లెందు టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ఇల్లెందు మున్సిపాలిటీ పరిధిలో సేకరించిన చెత్తను రీసైక్లింగ్ చేసే బయోమైనింగ్ కేంద్రాన్ని సోమవారం ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ ఛైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. డంపింగ్‌యార్డులో డంపింగ్ చేసిన చెత్తను రీసైక్లింగ్ చేసే పద్ధతిలో చెత్తను వేరు చేసి ఎరువును అందించే బయోమైనింగ్ కేంద్రం జిల్లాలోనే ప్రప్రథమంగా ప్రారంభించారు. వారు మాట్లాడుతూ బయోమైనింగ్ కేంద్రం ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. ప్రతి రోజు రెండు, మూడు టన్నుల చెత్తను రీసైక్లింగ్ చేసేందుకు అనువుగా యంత్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.



ఆంధ్రజ్యోతి KHAMMAM CITY

మంగళవారం 12 నవంబరు 2024

● ఖమ్మం ● రఘునాథపాలెం
● ఖమ్మం రూరల్
● తిరుమలాయపాలెం
● కూసుమంచి
● నేలకొండపల్లి ● కామేపల్లి

ఖమ్మం సిటీ

ZONE

'విన్‌ఫీల్డ్'లో కంటి పరీక్షలు



ఖమ్మం ఖానాపురంహవేలి నవంబరు11(ఆంధ్రజ్యోతి): నగరంలోని విన్‌ఫీల్డ్ పాఠశాలలో నగరంలోని ఓ ఆసుపత్రి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారు. పాఠశాలలోని 200 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించినట్లు పాఠశాల డైరెక్టర్లు గడ్డె పుల్లారావు, మన్నె కాషార్‌కుమార్, పోలవరపు శ్రీకాంత్ తెలిపారు. కొంతమందికి చిన్నచిన్న సమస్యలు రావటంతో కంటి అద్దాలు అవసరమవుతాయని వైద్యులు సూచించారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	38 రూ.
వంకాయ	54
గుత్తి వంకాయ	60
బీరకాయ	48
పచ్చిమిర్చి	38
కాకరకాయ	34
బెండకాయ	34
పొట్లకాయ	48
దోసకాయ	40-68
గోరుచిక్కుడు	58
చిక్కుడు	60
నాటుచిక్కుడు	130
క్యాబేజీ	44
దొండ	38-50
సొరకాయ	28
క్యారెట్	84
క్యాప్సికం	60
ఆలుగడ్డ	40
ఉల్లిగడ్డ	60-70
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	175
కొత్తిమీర కట్ట	40

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

సినిమా CINEMA

నగరంలో చిత్రాలు..

వినోద:	లక్కీభాస్కర్
శ్రీనివాస:	అమరన్
సాయిరాం:	అపుడో ఇప్పుడో ఎపుడో
ఆదిత్య:	క
తిరుమల:	దేవర
సినీ గెలాక్సీ:	ధూంధాం

బ్రహ్మకుమారి ఈశ్వరీయ విద్యాలయం

సేవలు ప్రపంచానికి ఆదర్శం

వ్యవసాయ, గిడ్డంగుల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మంత్రి తుమ్మలకు జ్ఞాపిక బహూకరిస్తున్న సంతోష్ దీదీ

ఖమ్మంసాంస్కృతికం, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విద్యాలయ సేవలు ప్రపంచానికే ఆదర్శమని వ్యవసాయ, గిడ్డంగుల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం ఖమ్మంలో జరిగిన బ్రహ్మకుమారి ఈశ్వరీ విశ్వవిద్యాలయ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అత్యున్నత విలువలతో కూడిన సంస్థ బ్రహ్మకుమారి అని అన్నారు. ఈశాఖను హైదరాబాద్‌లో కూడా ఏర్పాటు చేయాలని దీదీని మౌంట్‌అబూలో విన్నవించానని తుమ్మల చెప్పారు. మా విన్నపాన్ని మన్నించి హైదరాబాద్‌లో మౌంట్‌అబూకు దీటుగా సంస్థను ఏర్పాటు చేశారన్నారు. ఆరోజు శంకుస్థాపన, ప్రారంభోత్సవాల్లో కూడా పాల్గొనే అవకాశం వచ్చిందని అన్నారు. అన్ని ముఖ్య పట్టణాల్లో ఈసంస్థ ఏర్పాటు కావాలన్నారు. కొత్తగూడెం, ఖమ్మం, భద్రాచలంలలో సంస్థల ఏర్పాటు సమయంలో పనుల వత్తిడివల్ల తాను పాల్గొనలేక పోయానన్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారి నిర్వాహకురాలు సంతోష్ దీదీ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధిత కానిస్టేబుల్‌కు ఆర్థికసాయం

ఖమ్మంక్రైం,నవంబరు11(ఆంధ్రజ్యోతి): ఇటీవల వరదల కారణంగా జిల్లా సాయుధ దళం హెడ్‌కానిస్టేబుల్ నాగేశ్వరరావు ఇల్లు నీటమునిగింది. దీంతో 1998 కానిస్టేబుల్ బ్యాచ్‌కు చెందిన సిబ్బంది రూ.65వేలు అందించారు. సోమవారం ఆయన్ను కలిసి నగదును అందించారు.

ప్రజలు చెప్పేది వింటే..

సగం సమస్యలు తీరుతాయి

- గత వారం ఫిర్యాదులపై చర్యల నివేదికలు ఎందుకు ఇవ్వలేదు
- మంచిగా పనిచేస్తే చిన్న సమస్యలకు ప్రజలు మంత్రుల వద్దకు ఎందుకు వెళ్తారు
- ఆషామాషీగా ఉద్యోగాలు చేయొద్దు
- ప్రజావాణిలో హెచ్చరించిన ఇన్‌చార్జ్ కమిషనర్ శ్రీజ



ఖమ్మంసంక్షేమవిభాగం, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): ప్రజలు చెప్పేది వింటే సగం సమస్యలు తీరుతాయని, ఫిర్యాదుదారులను ఎన్నిసార్లు కార్యాలయానికి తిప్పుకుంటారని ఇన్‌చార్జ్ కమిషనర్, స్థానిక సంస్థల కలెక్టర్ శ్రీజ హెచ్చరించారు. సోమవారం ఖమ్మం నగర పాలక సంస్థలో నిర్వహించిన ప్రజావాణిలో వినతిపత్రాలను స్వీకరించారు. మీరు మంచిగా పనిచేస్తే ప్రజలు, ఫిర్యాదుదారులు ప్రతి చిన్న సమస్యకు మంత్రుల వద్దకు ఎందుకు వెళ్తారని, ఆషామాషీగా ఉద్యోగాలు చేయొద్దని ఖమ్మం నగర పాలక సంస్థ అధికారులను ఘాటుగా హెచ్చరించారు. గత వారం వచ్చిన ఫిర్యాదులపై అధికారులు తీసుకున్న చర్యలపై విభాగాల వారీగా నివేదికలను అడిగారు. కేఎంసీలో ఏ అధికారి, ఉద్యోగికి కనీసం వినే ఓపిక లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను పది నెలలుగా ఇక్కడే పనిచేస్తున్నా అందరి పనితీరు గురించి తనకు తెలుసునన్నారు. దీంతో ఒక్కసారిగా నెవ్వరపోయిన కేఎంసీ విభాగాల అధికారులు బదులివ్వలేక పోయారు. ప్రతీ ఫిర్యాదుకు వారం రోజులులోగా పరిష్కారం చూపాలని తీసుకున్న చర్యలను తనకు నివేదించాలని పదే పదే ఫిర్యాదుదారులను ప్రజావాణికి తిప్పుకోవాల్సిన అవసరం లేదన్నారు. రాపర్తినగర్‌కు చెందిన ఓ మున్నేరు వరద బాధితుడుకి పరిహారం అందలేదని ఫిర్యాదురావటంతో లీడ్ బ్యాంకు మేనేజరు, పరిహారం చేరిన బ్యాంకు మేనేజరు, కేఎంసీ అధికారులను ఫోన్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా రాపర్తినగర్‌లో నిర్మాణం జరుగుతున్న అపార్టుమెంట్‌పై స్థానికులు ఫిర్యాదు చేయటంతో విచారణ చేసి తక్షణమే చర్యలు తీసుకొని సాయంత్రం వరకు రిపోర్టు ఇవ్వాలని ఆదేశించారు. వీడియోస్ కాలనీలో డ్రెయినేజీపై మరుగుదొడ్డి నిర్మాణం జరుపుతున్నారని స్థానికులు ఆనందరావు ఫిర్యాదు చేయటంతో వెంటనే పారిశుధ్య పర్యవేక్షకులు సాంబయ్యను ఫిర్యాదుదారుని వెంట పంచి చర్యలు తీసుకొని నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. తాగునీటి పంపుల కనెక్షన్లకు తాము గతంలో నగదు చెల్లించినా, తిరిగి బకాయిలు వస్తున్నాయని, నిబంధనలు అతిక్రమించి భవనాలు నిర్మాణాలు జరుగుతున్నాయని అధికంగా ఫిర్యాదులు అందాయి. మొత్తం 25 వరకు ఫిర్యాదులను ప్రజలు అందించారు. మున్నేరు ముంపు బాధితులు ప్రజావాణిలో నేరుగా ఇన్‌చార్జ్ కమిషనర్‌గా కల్వలేక పోయారు. పరిహారం మినహా ఇతర ఫిర్యాదుదారులను మాత్రమే ప్రజావాణిలో అనుమతించటంతో బాధితులు గొడవ చేశారు. ఈఈ కృష్ణలాల్, డీసీపీ వికాస్, ఏసీపీ వసుంధర, ఆర్వో శ్రీనివాసరావు, ఏవో శివలింగం పాల్గొన్నారు.

పట్టణ ప్రణాళిక అధికారిపై కార్పొరేటర్ శరత్‌కుమార్ ఫిర్యాదు

ఖమ్మం నగర పాలక సంస్థలో డీసీపీగా పనిచేస్తున్న వికాస్ తనను అగౌరవపరిచేలా వ్యవహరించారని కార్పొరేటర్ శరత్‌కుమార్ ఇన్‌చార్జ్ కమిషనర్ శ్రీజకు ఫిర్యాదు చేశారు. కార్యాలయంలో అధికారుల సమక్షంలోనే తనను ఏకవచనంతో మాట్లాడారని ఆరోపించారు. సీసీ ఛాంబర్‌లో ఉన్న వీడియో చిత్రాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు.

19న బీసీ కమిషన్ ప్రతినిధుల బృందం రాక

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన అవసరమైన రిజర్వేషన్ల దామాషాను పేర్కొనే విషయంలో ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేందుకు తెలంగాణ బీసీ కమీషన్ ప్రతినిధుల బృందం ఈనెల 19న ఖమ్మం జిల్లాకు రానున్నారని కలెక్టర్, ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలకు సంబంధించి 19న ఖమ్మంలోని కలెక్టరేట్ కార్యాలయాలంలో ఉదయం10గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బృందం నేతృత్వంలో ప్రజాభిప్రాయ సేకరణ జరుపనుందని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి జీ జ్యోతి తెలిపారు. అభిప్రాయాలు తెలియచేయాలనుకునే వారు రాతపూర్వక సమర్పణలు, అభ్యర్థనలను నేరుగా సమర్పించవచ్చని సూచించారు. వాతపూర్వక సమర్పణలు, అభ్యర్థనలు మొదలగునవి, ఆరుసెట్లలో వెరిఫికేషన్ అఫిడవిట్‌తో పాటుగా (రూ.20/- నాన్-జ్యూడీషియల్ స్టాంపు పేపరుపై) నిర్దేశిత నమూనాలో తెలుగు లేదా ఆంగ్ల భాషలో ఇవ్వాల్సి ఉంటుందని, వాదనలకు మద్దతుగా ఉన్న సమాచారం, మెటీరియల్, సాక్ష్యాలను, సంబంధిత కేసుల వివరాలను పేర్కొంటూ సమర్పించాలని చెప్పారు.



చెర్వుమాధారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

రైతులకు ఇబ్బందులు కలిగించకండి

- అదనపు కలెక్టర్ శ్రీజ

నేలకొండపల్లి,నవంబరు11(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్ళల్లో రైతులను ఎట్టి పరిస్థితుల్లో ఇబ్బందులు పెట్టొద్దని అడిషనల్ కలెక్టర్ శ్రీజ ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులను ఆదేశించారు. సోమవారం అడిషనల్ కలెక్టర్ శ్రీజ చెర్వుమాధారంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసారు. కాంటాలు సరిగా ఉన్నాయా? రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలను అమర్చారా? అంటూ నిర్వాహకులను ప్రశ్నించారు. తహసీల్దార్ జాదవ్ మాణిక్యం, ఎంపీడీఓ యర్రయ్య తదితరులు అడిషనల్ కలెక్టర్ వెంట ఉన్నారు.

ప్రతీ ధాన్యం గింజను ప్రభుత్వం కొంటుంది

తిరుమలాయపాలెం: రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేసి, మద్దతు ధర అందిస్తుందని బీరోలు సొసైటీ చైర్మన్ రామసహాయం నరేష్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కాకరవయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. రైతులకు అన్యాయం జరగకుండా పండించిన పంటకు మద్దతు ధర కలిపిస్తుందన్నారు. ఈకార్యక్రమంలో సీవో సత్యనారాయణ, సొసైటీ డైరెక్టర్లు ఉపేందర్, లింగయ్య, నాయకులు శ్రీనివాసరెడ్డి, ఎం.నాగయ్య, పాల్గొన్నారు.

డ్రెయినేజీపై మరుగుదొడ్డి నిర్మాణం

రూ.4వేల జరిమానా

ఖమ్మంసంక్షేమవిభాగం, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): డ్రెయినేజీపై మరుగుదొడ్డి నిర్మాణంపై సమీప ప్రాంత ప్రజల ఫిర్యాదు చేశారు. దీంతో కేఎంసీ ఇన్‌చార్జ్ కమిషనర్ శ్రీజ ఆదేశాల మేరకు తక్షణం సిబ్బంది స్పందించారు. వారు వీడియోస్ కాలనీలో ఈ నిర్మాణాన్ని పరిశీలించారు. ఇంటి యజమానికి అధికారులు సోమవారం రూ.4వేలు జరిమానా విధించారు.

యువతి అదృశ్యం

ఖమ్మంక్రైంనవంబరు 11(ఆంధ్రజ్యోతి): యువతి అదృశ్యంపై ఖానాపురం హవేలీ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం రాత్రి కేసునమోదైంది. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలానికి చెందిన ఆలేటి రవీంద్రరెడ్డి కుమార్తె మృదుల నగరంలోని ఓ కళాశాలలో ఇంజనీరింగ్ మూడో సవత్సరం చదువుతుంది. ఆదివారం సాయంత్రం ఇంటికి వెళ్తానని చెప్పి తండ్రితో మాట్లాడింది. కళాశాలలో పర్మిషన్ తీసుంది. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో పలు చోట్ల వెతికారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో తండ్రి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేశారు.

ఎంవీపాలెం పాఠశాలను సందర్శించిన ఆర్జేడీ



ప్రొగ్రెస్ కార్డులు అందజేస్తున్న ఆర్జేడీ

ఖమ్మంరూరల్, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎంవీపాలెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం వరంగల్ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి సందర్శించారు. పదోతరగతి, 9వ తరగతి విద్యార్థులను వ్యక్తిగతంగా వివిధ సబ్జెక్టుల్లో ప్రశ్నించారు. వారి నుంచి జవాబులను తెలుసుకున్నారు. పదోతరగతి విద్యార్థులకు గణితంలో ఈజీగా స్కోర్ చేసే విధంగా కొన్నిమెలకువలను నేర్పించారు. ఆయన పాఠశాల పరిసరాలను మరుగుదొడ్లను ఆట స్థలాన్ని, వంటగదిని తదితర వాటిని పరిశీలించారు. ఉపాధ్యాయుల డైరీ లెసన్ ప్లాన్‌లను పరిశీలించారు. 10వ తనగతి పబ్లిక్ పరీక్షలలో అత్యధిక మందిని ఏ గ్రేడ్‌లో పాస్ అయ్యే విధంగా చేయాలన్నారు. ట్రిబుల్ ఐటీ సీట్స్ సాధించాలని ఆదేశించారు. ఆయన చేతుల మీదుగా పదో తరగతి విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డ్స్ ను అందించారు. ఆయన వెంట సీసీ మాధవరావు, ప్రధానోపాధ్యాయుడు జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి



ఖమ్మం లీగల్ నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయసేవాధికారసంస్థ కార్యదర్శిగా కె.వి.చంద్రశేఖరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఖమ్మం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారిగా పనిచేస్తూ బదిలీపై న్యాయసేవాధికారసంస్థ కార్యదర్శిగా పూర్తి బాధ్యతలు చేపట్టారు.

సర్వేపై ఎన్యూమరేటర్లకు శిక్షణ

ఖమ్మంసంక్షేమవిభాగం, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): సమగ్రఇంటింటి సర్వే 96 శాతం మేరకు పూర్తి కావటంతో ఇక సర్వేపై అధికారులు దృష్టి పెట్టారు. సోమవారం డీపీఆర్సీ భవనంలో ఎన్యూమరేటర్లుకు రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

కొణిజర్లలో ఆర్టీసీ కార్గో పార్సిల్ సేవలు

కొణిజర్ల,నవంబరు11(ఆంధ్రజ్యోతి): మండల కొణిజర్లలో గ్రామానికి చెందిన ఉపేందర్ ఫోటో స్టూడియోలో టీజీఎస్ ఆర్టీసీ కార్గో పార్శిల్ సర్వీస్‌పాయింట్‌ను ఏర్పాటు చేశారు. సోమవారం ఆర్టీసీ డీఎంఈ వీరభద్రం, ఆర్ఎంఈ వర్మ ప్రారంభించారు. ఆర్టీసీ ద్వారా సేవలను అందుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికి సర్వే బృందం వెళ్లాలి

కొణిజర్ల, నవంబరు11(ఆంధ్రజ్యోతి): సమగ్రసర్వే బృందం ప్రతీ ఇంటికి వెళ్లి వివరాలను జాగ్రత్తగా నమోదు చేసుకోవాలని డీఎల్‌పీవో రాంబాబు, ఎంపీడీవో రోజారాణి సర్వే బృందానికి సూచించారు. మండలంలోని తనికెళ్ళ, గోపవరం, లింగగూడెం గ్రామాలలో జరుగుతున్న సర్వేను సోమవారం పరిశీలించారు. ఎవరూ కూడ తప్పిదం చేయవద్దని తెలిపారు. ప్రజల నుంచి క్లుప్తంగా వివరాలు సేకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో రాజేశ్వరి, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజానేత మలీదు జగన్

సంస్మరణ సభలో మంత్రులు తుమ్మల, పొంగులేటి



నివాళులు అర్పిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంసంక్షేమవిభాగం,నవంబరు11 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలు పరిష్కారానికి అలుపెరగని పోరాటాలు చేసిన ప్రజానేత మలీదు జగన్ అని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. 3వ డివిజన్ కార్పొరేటర్ మలీదు జగన్ దశదిన కర్మ సోమవారం ఖమ్మంలోని బల్లేపల్లిలో ఆయన నివాసంలో జరిగింది. నేతలిద్దరూ వేర్వేరుగా నివాళులర్పించారు. ఈ సదర్భంగా తుమ్మల మాట్లాడుతూ జగన్ లేక పోవటం వ్యక్తిగతంగా ఎంతో లోటుగా భావిస్తున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 2009 నుంచి జగన్‌తో మంచి సంబంధాలు ఉన్నాయని తెలిపారు. నాతో పాటే రాజకీయంగా అడుగులు వేశారని, మంచి మిత్రుడ్ని కోల్పోయానని పేర్కొన్నారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీలు బాలసాని లక్ష్మీనారాయణ, పొట్ల నాగేశ్వరరావు, ఖమ్మం ఏఎంసీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వర్లు, లకావత్ సైదులునాయక్, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, పల్లెబోయిన భారతిచంద్రం, కొప్పెర ఉపేందర్, మిక్కిలినేని మంజుల పలువురు రాజకీయ నాయకులు నివాళులర్పించారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు చేరుకోవాలి

తిరుమలాయపాలెం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఎస్ఐ కూసుపుడి జగదీష్ అన్నారు. సోమవారం మండలంలోని మాదిరిపురం వద్ద ఎస్సీ గురుకుల పాఠశాలను, తిరుమలాయపాలెంలోని కేజీబీవీ పాఠశాల, కళాశాలను సందర్శించారు. క్రమశిక్షణతో చదివి తల్లిదండ్రులు కలలు సాకారం చేయాలన్నారు. విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రాఘవయ్య, ఎస్వో రమాకుమారి,హెడ్‌కానిస్టేబుల్ రమాదేవి పాల్గొన్నారు.



మాదిరిపురంలో విద్యార్థులతో సహపంక్తి భోజనం చేస్తున్న ఎస్ఐ

ఆలయాలకు కార్తీక శోభ







ఎస్పీ ఆఫీస్‌రోడ్డు శివాలయంలో పోటెత్తిన భక్తులు, శ్రీనివాసనగర్ శివాలయంలో 20రూపాయల నాణేలతో అలంకరణ

రెవెన్యూ సిబ్బందిపై దాడి అమానుషం

ఖమ్మంకలెక్టరేట్, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ కలెక్టర్, అదనపు కలెక్టర్, కుడా ప్రత్యేక అధికారి, కొండిగల్ తహసీల్దార్, రెవెన్యూ సిబ్బందిపై దాడి హేయమైన చర్యని ట్రెసా అధ్యక్షుడు తుంబూరు సునీల్ రెడ్డి అన్నారు. ఫార్మా కంపెనీ భూసేకరణ ప్రక్రియలో భాగంగా గ్రామసభలో పాల్గొనడానికి వచ్చిన వారిపై దాడి సరికాదని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) జిల్లా శాఖ తరపున తీవ్రంగా ఖండించారు. ప్రజల కోసం పని చేసే అధికారులపై ఇలాంటి ఘాతుకానికి పాల్పడటం హేయమైన చర్య అన్నారు. ఇలాంటి హీనమైన చర్యల వల్ల ఉద్యోగుల ఆత్మస్థైర్యం దెబ్బతిని, భయాందోళనలకు గురవుతున్నారన్నారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేసారు. ట్రెసా జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్లయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారుమంచి శ్రీనివాసరావు ఈ దాడిని ఖండించారు.

బాధ్యతలు చేపట్టిన ఏఆర్ ఏడీసీపీ కుమారస్వామి



సీపీకి మొక్క అందిస్తున్న కుమారస్వామి

ఖమ్మంక్రైం,నవంబరు11(ఆంధ్రజ్యోతి): ఏఆర్ అదనపు డీసీపీగా సీహెచ్ కుమారస్వామి సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం సీపీ సునీల్‌దత్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను బహూకరించారు. ఇటీవల బదిలీల్లో భాగంగా ఏఆర్ విభాగానికి ఏడీసీపీగా నియమితులయ్యారు. సీసీఆర్బీ ఏసీపీగా నియమితులైనపి.రవీందర్‌రెడ్డి కూడా సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఏసీపీని కలిసి మొక్కను బహూకరించారు.

మాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు

ఖమ్మంచర్చికాంపౌండ్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఈనెల9న నగరంలోనిప్రెస్‌క్లబ్‌లో కొందరు మాపై తప్పుడు ప్రచారాలతో విలేకరులసమావేశం నిర్వహించారని దీనిని మేము ఖండిస్తున్నామని పొట్ల శ్రీనివాసరావు, మణి పేర్కొన్నారు. సోమవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నగరంలోని సాయిగణేష్ నగర్‌లో నివాసం ఉంటూ చిరువ్యాపారం నిర్వహిస్తున్న ఓ వ్యక్తి కుమారుడికి కరెంట్ స్థంబాలకు తగిలి విద్యుత్ ప్రమాదం జరిగిందని తెలిపారు.కాలనీ గ్రూపులో పిల్లాడికి సహాయం చేయాలనే క్రమంలో రూ.54వేలు ఆసుపత్రికి వెళ్లి బాలుడు తల్లిదండ్రులకు అందించామన్నారు. మరికొంత నగదును వసూలు చేసి కుటుంబానికి అందిద్దామని అనుకున్నామని చెప్పారు. కానీ ఆ వారు మాపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మనస్తాపం చెంది వివరాలు వెల్లడించేందుకు ముందుకు వచ్చామని తెలిపారు.

జమలాపురంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం

ఎర్రుపాలెం, నవంబరు11(ఆంధ్రజ్యోతి): తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా సోమవారం సామూహిక సత్యనారాయణవ్రతం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపించారు. 37మంది దంపతులు ఈ వ్రతంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాదాయ ధర్మాదాయశాఖ ఆదేశానుసారం కార్తీకమాసం సందర్భంగా ప్రత్యేకపూజలు, దీపోత్సవంముల ప్రతి సోమవారం, ఏకాదశి, పౌర్ణమి తిధులలో నిర్వహిస్తామన్నారు. ఈకార్యక్రమంలో వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా బ్రిడ్జి నిర్మాణం



ఇల్లూరు వద్ద వాగుపై అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి

మధిరరూరల్, నవంబరు11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇల్లూరు వద్ద వాగుపై అసంపూర్తిగా బ్రిడ్జిని నిర్మించి వదిలేయడంతో అటుగా వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మధిర నుంచి ఇల్లూరు మీదుగా ఏపీలోని నందిగామ, కంచికచర్ల మండలాలకు వెళ్లేందుకు ఈ రహదారి కీలకంగా ఉంది. ఈ రహదారిలో ఇల్లూరు గ్రామం దాటిన తర్వాత ఆంధ్రా-తెలంగాణ సరిహద్దులో వాగుపై మూడు సంవత్సరాల క్రితం బ్రిడ్జి నిర్మాణానికి రూ.మూడుకోట్లు మంజూరయ్యాయి. పనులు చేపట్టిన కాంట్రాక్టర్ నాలుగు కానాలు నిర్మించి అసంపూర్తిగా వదిలేశాడు. వర్షాకాలంలో ఈ వాగుపై పెద్ద ఎత్తున వరదనీరు ప్రవహిస్తూ ఉంటుంది. దేశినేనిపాలెం చెరువు అలుగు నీరంతా ఈ వాగుపైనే వెళ్తుంటుంది. ఈ బ్రిడ్జి నిర్మాణం ప్రారంభించినప్పుడు అప్రోచ్ రోడ్డు నిర్మించారు. అది కూడా ఇటీవల వర్షాలకు దెబ్బతిన్నది. ఇప్పటికైనా అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తిచేయాలని, బీటీ రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదాలకు నిలయంగా రహదారులు

చింతకాని, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామీణ రహదారులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. మండలంలో రెండు జాతీయ రహదారుల నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నవి. అందులో భాగంగా రోడ్డు నిర్మాణ పనులకు ఇతర ప్రాంతాల నుంచి భారీ వాహనాలతో మట్టి తోలకాలు చేపడుతున్నారు. భారీ టిప్పర్లు గ్రామీణ రోడ్లపై తిరుగుతుండటం, అప్పటి ప్రామాణాలకు అనుగుణంగా నిర్మించిన రహదారులపై భారీ బరువున్న మట్టి టిప్పర్లు తిరగడంతో రోడ్లన్నీ భారీగా గుంతలు ఏర్పడటంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మం డల పరిధిలోని పొద్దుటూరు-నాగిలిగొండ, కోమట్లగూడెం- నేరడ, లచ్చగూడెం-రామకృష్ణాపురం, వందనం-కొదుమూరు, కొదుమూరు- అల్లీపురం రహదారుల గుండా టిప్పర్లు తిరుగుతుండటంతో రోడ్లపై గుంతలు ఏర్పడి ప్రయాణానికి ఇబ్బందిగా మారాయి. ఇంత జరుగుతున్న జాతీయ రహదారి నిర్మాణ సంస్థ రోడ్లకు మరమ్మతులు చేయకుండా తమపని తాము చేసుకుంటూపోతున్నాయి. రోడ్లకు మరమ్మతులు చేసి ప్రమాదాలను నిరోధించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



గుంతలమయంగా మారిన లచ్చగూడెం- రామకృష్ణాపురం రోడ్డు

కంది, పెసర పంటలకు రక్షణ ముఖ్యం



తెగుళ్లబారిన పడిన కంది పంట

మధిర, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): వాతావరణ పరిస్థితుల కనుగుణంగా పంటల పరిస్థితిని మధిర వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు రుక్మిణీదేవి, భరత్, నాగస్వాతిలు పరిశీలించి కంది, పెసర, మినుము పంటలను పలు రకాల తెగుళ్లు ఆశించి నష్టపరుస్తున్నాయని వాటి నివారణకు రైతులకు పలు సూచనలు చేశారు.

కంది పంట మొగ్గదశనుంచి పూత దశలో ఉంది. ఈ దశలో మారుకా మచ్చల పురుగు ఆశిస్తున్నట్లు గమనించడం జరిగింది. దీని నివారణలో భాగంగా మొదటగా వేపనూనె ఒకలీటరు+క్లోరిపైరిఫాస్ 500 మి.లీ. ఎకరానికి సరిపడా నీటితో కలిపి పిచికారి చేసుకోవాలి. పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నట్లైతే నోవాల్యూరాని 100మి.లీ. లేదా కోరాంట్రానిలిప్రోల్ 60మి.లీ. లేదా ఫ్యూబెండెమైడ్ 40మి.లీ. ఎకరానికి పిచికారి చేసుకోవాలి. ఈమారుకా మచ్చల పురుగు కందినే కాకుండా పెసర, మినుము పంటలను కూడా ఆశించి నష్టపరుస్తుందని గమనించి జాగ్రత్తలు చేపట్టాలి.

పెసర, మినుము పంటలను సోకే తామర పురుగులు, పొగాకు లద్దెపురుగు నివారణకు గాను ఫిప్రోనిల్ 300మి.లీ. లేదా డైమిథోయేట్ 400 మి.లీ. లేదా స్పైనోశాడ్ 60మి.లీ. ఎకరానికి పిచికారి చేసుకోవాలి. రైతులు ఈ పురుగుల ఉధ్రుతిని గమనిస్తూ ఎప్పటికప్పుడు నివారణ చర్యలు తీసుకుంటే పంటలను నష్టాల నుం చి కాపాడుకోవచ్చని శాస్త్రవేత్తలు సూచించారు.

ప్రతి ఇంటికి సర్వే బృందం వెళ్లాలి: డీఎల్‌పీవో



తనికెళ్లలో సర్వేను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో రాంబాబు

కొణిజర్ల, నవంబరు11(ఆంధ్రజ్యోతి): సమగ్రసర్వే బృందం ప్రతి ఇంటికి వెళ్లి వివరాలను జాగ్రత్తగా నమోదు చేసుకోవాలని డీఎల్‌పీవో రాంబాబు, ఎంపీడీవో రోజారాణి సర్వే బృందానికి సూచించారు. మండలంలోని తనికెళ్ళ, గోపవరం, లింగగూడెం గ్రామాలలో జరుగుతున్న సర్వేను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేకు సంబంధించి మొత్తం శిక్షణ ద్వారా ఇవ్వడం జరిగిందని, ఎవరూ కూడా తప్పిదం చేయవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో రాజేశ్వరి, తదితరులున్నారు.

పుస్తక పఠనంతోనే విజ్ఞానం

» అభయ ఫౌండేషన్ ఫౌండర్ సీవీ. బాలచంద్ర



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న బాలచంద్ర

ఏన్కూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనంతోనే విజ్ఞానం పెంపొదుతుందని అభయ ఫౌండేషన్ ఫౌండర్ సీవీ బాలచంద్ర అన్నారు. సోమవారం స్థానిక గురుకుల విద్యాలయంలో అభయ ఫౌండేషన్ పూర్వ విద్యార్థులు సంయుక్తంగా ఏర్పాటు చేసిన నూతన రీగల్ రెక్సనార్డ్ గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ తుడి శ్రీనివాసరెడ్డి, వీఐఎస్ఈ వ్యవస్థాపకుడు దేవకి వాసుదేవరావు, విశ్రాంత డిప్యూటీ సెక్రటరి కొదుమూరి రవి, రూ.5లక్షల విరాళం అందించిన పూర్వవిద్యార్థి తండ్రి డాక్టర్ రాఘవరావు, అల్యూమిని పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షుడు బండి గిరిబాబు, జోగారావు, కృష్ణ నాగయ్య, భీక్షం, ఆనందరావు, అనిల్, కుటుంబరావు, ఏటీపీ సునీల్, వేము రాజు, డిప్యూటీవార్డెన్ విశ్వేశ్వరరావు, సుదర్శన్‌రావు, శ్రీనివాస్, రవికుమార్, మోహన్, రజిని, విజయకుమారి పాల్గొన్నారు.

విద్యుత్‌లైన్ కోసం సంతకాల సేకరణ



గ్రామంలో సంతకాల సేకరణ చేస్తున్న దృశ్యం

కొణిజర్ల, నవంబరు11(ఆంధ్రజ్యోతి): పెద్దగోపతి సబ్‌స్టేషన్ నుంచి కొత్తగా డబుల్‌రోడ్డు వేసిన రోడ్డు పక్కన నుంచి 11కేవీ కొత్తలైను వేసి, 24 గంటల త్రీఫేజ్ విద్యుత్ ఇవ్వాలని గ్రామంలో సంతకాలు సేకరణ చేసి జిల్లా కలెక్టర్‌కు గ్రీవెన్స్ ద్వారా సంతకాలతో చేసిన వినతిని సమర్పించారు. సీపీఎం జిల్లా నాయకులు తాళ్ళపల్లి కృష్ణ, మండల కార్యదర్శి చెరుకుమల్లి కుటుంబరావుల ఆధ్వర్యంలో గ్రామస్థులు సంతకాలు చేసిన వినతిపత్రాన్ని గ్రీవెన్స్‌లో కలెక్టర్ కార్యాలయంలో సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, రమేష్, బ్రహ్మయ్య, రామదాసు, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఐక్య క్రిస్మస్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎనోష్‌కుమార్

కల్లూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కల్లూరులో సోమవారం అసోసియేషన్ ఇండిపెండెంట్ క్రిస్టియన్ కమిటీ ఆధ్వర్యంలో ఐక్యక్రిస్మస్ వేడుకల పోస్టర్‌ను ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి. ఎనోష్‌కుమార్, జిల్లా ప్రేయర్‌సెల్ అధ్యక్షుడు టీ. నిర్మల్‌కుమార్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐక్య క్రిస్మస్ సంబరాలకు క్రిస్మస్ సందేశం అందించేందుకు రాజఫైయిత్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు పాస్టర్ రాజ హెబేలు హాజరుకానున్నారని తెలిపారు. ముఖ్య అతిథిలుగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల, పొంగులేటి, ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌లు పాల్గొననున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ధర్నాసీ బాలరాజు, మీడియాసెల్ అధ్యక్షుడు దాసరి డేవిడ్‌రాజు, మండల అధ్యక్షుడు తేళ్ల ఎబినేజర్, టీ సంజీవరావు, జాన్‌పరంజ్యోతి, జీవన్‌కుమార్, రాశేశేఖర్, ఆర్ తిమోతి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

» సత్తుపల్లి, వైరా ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, రాందాస్‌నాయక్



పెద్దకోరుకొండిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాగమయి



రాజలింగాల కొనుగోలు కేంద్ర వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

కల్లూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్దకోరుకొండి, లింగాల గ్రామాల్లో సోమవారం డీసీఎంస్, ఐకేపీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బాగం నీరజాదేవి, ఆర్డీవో రాజేంద్రగౌడ్, తహసీల్దార్ సాంబశివుడు, ఎంపీడీవో చంద్రశేఖర్, సీడీపీవో నిర్మల జ్యోతి, ఏనుగు సత్యంబాబు, మద్దినేని లోకేష్, దేవరపల్లి వెంకటేశ్వరరావు, ఏపీఎం వెంకటారామారావు, కృష్ణకుమారి, నాగమణి, సీసీ ఎస్తేరు తదితరులున్నారు.

ఏన్కూరు, నవంబరు11(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగించుకోవాలని ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో రమేస్, తహసీల్దార్ శేషగిరారావు, ఐకేపీ ఏపీఎం హరినారాయణ, మం డల పార్టీ అధ్యక్షుడు స్వర్ణ నరేంద్రకుమార్, గుత్తా వెంకటేశ్వరరావు, వేములకృష్ణ ప్రసాద్, మేడ ధర్మారావు, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

వైరా, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ మార్కెట్‌కమిటీలో డీసీఎంఎస్ ద్వారా ఖరీఫ్ సీజన్లో రైతులు పండించిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ మర్క్‌ఫెడ్ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా మండల పట్టణ, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదూనూరి సీతారాములు, వైరా పురపాలక సంఘం అధ్యక్షుడు సూతకాని జైపాల్, దాసరి దానియేలు, బీడీకే రత్నం, రాంపూడి రోశయ్య, మచ్చ బుజ్జి, హరినాధ్, తదితరులున్నారు.

కొణిజర్లలో ఆర్టీసీ కార్గో పార్సిల్ సేవలు

కొణిజర్ల, నవంబరు11(ఆంధ్రజ్యోతి): మండల కొణిజర్లలో గ్రామానికి చెందిన ఉపేందర్ ఫోటో స్టూడియో నందు టీజీఎస్ ఆర్టీసీ కార్గో పార్శిల్ సర్వీస్ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. దానిని సోమవారం ఆర్టీసీ డీఎంఈ వీరభద్రం, ఆర్ఎంఈ వర్మ ప్రారంభించారు. ఆర్టీసీ ద్వారా సేవలను అందుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

వెండి పాదుకల వితరణ

బోనకల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోచి చొప్పకట్లపాలెం గ్రామంలో కొలువు తీరిన పార్వతిదేవి అమ్మవారికి సోమవారం దొంతినేని ప్రసాద్, కళావతి దంపతులు వెండి పాదుకలను వితరణగా అందజేశారు. వితరణ గావించిన వీరికి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

హమాలీ కూలీ రేట్లు పెంపు పట్ల హర్షం

సత్తుపల్లిరూరల్, నవంబరు11(ఆంధ్రజ్యోతి): హమాలీ కూలీ రేట్లు పెంపు పట్ల ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా సోమవారం స్థానిక నీలం రామచంద్రయ్య భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆసంఘ జిల్లా నాయకులు మాట్లాడుతూ సత్తుపల్లి, వేంసూరు మండలంలో హమాలీ, కాటా కూలీ రేట్లు పెంచాలని కార్మికులు సమ్మెకు దిగడంతో వ్యాపారులు చర్చలు జరిపి కూలిరేట్లు పెంచడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ధాన్యం వ్యాపారులు నడిపల్లి రాము, గుండు ప్రసాద్, వల్లపూడి రాంబాబు, గంధం రామకృష్ణ, నాయకులు వెంకన్న, అమర్లపూడి శరత్, ధరావత్ వెంకటేశ్వరరావు, చెన్నారావు, అప్పారావు, మారేశ్వరరావు, సత్యనారాయణ తదితరులున్నారు.

రేషన్‌కార్డుల్లో పేర్లు గల్లంతు..

» తల్లిదండ్రుల పేర్లు మాయం....పిల్లల పేర్లు మాత్రమే ఉన్నవైనం



రేషన్‌కార్డులో పేర్లు లేని శ్రీనివాసరావు దంపతులు

బోనకల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): వారిది నిరుపేద కుటుంబం. నాడు దారిద్ర్య రేఖ కింద వీరి కుటుంబాన్ని గుర్తించి తెల్ల రేషన్ కార్డును మంజూరు చేశారు. ఎంతగానో సంతోషపడ్డ ఆ కుటుంబానికి పేర్ల గల్లంతు శాపంగా మారింది. మండలంలోని చిరునోముల గ్రామానికి చెందిన మోదుగుల శ్రీనివాసరావు, అరుణ దంపతులకు ఇద్దరు పిల్లలు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇల్లు కట్టుకునే స్థోమత లేకపోవడంతో శిథిలావస్థలో ఉన్న ఇంట్లోనే కాలం గడుపుతున్నారు. కాగా తెల్ల రేషన్ కార్డులో నలుగురు పేర్లు ఉండటంతో వారికి కొంత కాలం సక్రమంగా రేషన్ అందేది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో రేషన్ కార్డులో పిల్లలిద్దరి పేర్లు మాత్రమే ఉండి, తల్లిదండ్రుల పేర్లు గల్లంతయ్యాయి. తమ పేర్లు లేకపోవడంతో వారు లబోదిబోమంటూ అధికారులు, ప్రజా ప్రతినిధులను గత పది ఏళ్లగా కలిసి ఫిర్యాదులు చేస్తూనే ఉన్నారు. కాని సమస్య పరిష్కారం మాత్రం జరగలేదు. కొత్త రేషన్ కార్డుల మంజూరుతో పాటు రేషన్ కార్డుల్లో చేర్పులు, మార్పులను చేసే ప్రక్రియ నిలిచి పోవడంతో పది ఏళ్లగా వారి సమస్య అలాగే ఉంది.

రేషన్ కార్డులో వరుసగా కుటంబ సభ్యులు రేషన్ తీసుకోక పోయినా, వేలి ముద్రలు వేయక పోయినా ఇలా జరుగుతాయని అధికారులు చెబుతున్నారు. తాము మాత్రం ప్రతి నెల రేషన్ తీసుకోవడంతో పాటు వేలి ముద్రలు కూడా వేస్తూనే ఉన్నామని తమ పేర్లు ఎందుకు గల్లంతయ్యాయో తమకు ఇప్పటికి అర్థ కావడం లేదని బాధిత కుటుంబం వాపోతున్నారు. ప్రభుత్వం రేషన్ కార్డు ద్వారా అందించే అన్ని ప్రభుత్వ పథకాలను కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ విషయం పై తహసీల్దార్ పున్నమ్ చందర్‌ను వివరణ కోరగా రేషన్ కార్డులో మార్పులు, చేర్పుల ప్రక్రియ ప్రారంభం కాగానే సమస్యకు పరిష్కారం దొరుకుతుందని తెలిపారు. సాంకేతిక కారణాల వలన గతంలో జరిగిన పొరపాట్లను సవరించేందుకు రేషన్ కార్డుల దిద్దుబాటు విధానం ప్రవేశ పెడితే పేర్ల సవరణ జరుగుతుందన్నారు.

రైతులకు ఎలాంటి ఇబ్బంది కలిగించొద్దు

» వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాంబాబు

కారేపల్లి, నవంబరు11(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని సీసీఐ కేంద్రానికి పత్తిని తీసుక వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించొద్దని ఇల్లెందు వ్యవసాయమార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సీసీఐ కేంద్రాన్ని సందర్శించి మాట్లాడారు. కార్యక్రమంలో స్పెషల్ గ్రెడ్ కార్యదర్శి బి.సుచిత్ర, మార్కెట్ కమిటీ సెక్రటరీ నరేష్ కుమార్, సీసీఐ అధినేత రాహులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అడ్డగోడ అయిలయ్య, భీముడు, హిరాలాల్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



సీసీఐ కేంద్రంలో పత్తిని పరిశీలిస్తున్న రాంబాబు

సామాజిక న్యాయం కోసం సీఎం కృషి

» కాంగ్రెస్ పార్టీ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దయానంద్

సత్తుపల్లి, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్వేచ్ఛా, సమానత్వం, సామాజిక న్యాయం కోసం సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ అన్నారు. నేషనల్ వెల్ఫేర్ డే సందర్భంగా సోమవారం స్థానిక ముస్లిం మైనార్టీ గురుకులంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందించారు. ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వీరరాగవయ్యతో పాటు అధ్యాపకులు, ఉపాధ్యాయులు, నాయకులు, పాల్గొన్నారు.

వైరాలో హోరాహోరీగా ఆటల పోటీలు

వైరా నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వైరా సాంఘిక సంక్షేమ బాలికల గురుకులంలో పదవ జోనల్‌స్థాయి జోనల్ స్పోర్ట్స్‌మీట్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. మొదటి రోజు జరిగిన అండర్-17 విభాగంలో 1,500 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అక్విల సాయిశ్రీ(ములకలపల్లి), డి.సాగరిక(టేకులపల్లి), పి.కీర్తినందిని(వైరా)లు విజయం సాధించారు.



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



పరుగు పందెంలో పాల్గొన్న క్రీడాకారిణులు

800 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు బి.హనీ(దానవాయిగూడెం) ఎం.హర్షిని(ఇల్లందు), డి.సాగరిక(టేకులపల్లి)

అండర్-19 విభాగంలో 1500 మీటర్ల పరుగుపందెంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఎస్.భావన(ములకలపల్లి)

800 మీటర్ల పరుగు పందెంలో వి.లావణ్య(కల్లూరు), యు.తేజస్విని(అంబేద్కర్ జూనియర్ కాలేజి ఖమ్మం), టి.తేజ(వైరా) విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు.

వీరికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, కలెక్టర్ ముజుముల్‌ఖాన్‌లు బహుమతులు అందజేశారు.

సాగునీటి విడుదలపై నిర్ణయం తీసుకోవాలని వినతి

వైరా నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వైరా రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలో సాగు భూములకు రబీ సీజన్లో రెండవ పంటకు సాగునీరు విడుదల తక్షణమే నిర్ణయం తీసుకోవాలని తెలంగాణ రైతుసంఘం ఆధ్వర్యంలో రైతులు ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఇరిగేషన్‌శాఖ కార్యాలయంలో డీఈ శ్రీనివాసరావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో అధిక వర్షాలు, తెగుళ్ల వలన పంట దిగుబడి తగ్గిపోయిందని, రబీ సీజన్లో రెండవ పంట సాగుకు నీరు విడుదల చేయాలని అన్నారు.

ప్రభుత్వ ఉన్నత అధికారులతో మాట్లాడి రెండోవ పంటకు సాగునీరు విడుదల చేయడం జరుగుతుందని దీనిపై బుధవారం రైతులతో సమావేశం నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతుసంఘం వైరా పట్టణ అధ్యక్షుడు మల్లెంపాటి రామారావు, కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు, సీఐటీయూ జిల్లా నాయకులు తోట నాగేశ్వరరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శీలం నర్సిరెడ్డి, ఏదూనూరి సీతారాములు, మచ్చా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

సీపీఐ సభ్యత్వ నమోదు

చింతకాని, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బస్వాపురం గ్రామంలో సోమవారం సీపీఐ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆ పార్టీ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ ఎప్పుడు ముందుంటుందన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి పావులూరి మల్లికార్జున్, మార్గం శ్రీనివాసరావు, బద్దల నరసింహరావు, బుర్రా అంజయ్య, ఆవుల వేలాద్రి, ఆవుల వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

తొపుడుబండి సాధిక్ కుటుంబానికి పరామర్శ

కల్లూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) తొపుడుబండి సాధిక్‌అలీ మృతిచెందిన సమాచారంతో స్థానికంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివిన బాల్యమిత్రులు సోమవారం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. బాల్యమిత్రులు చింతలపూడి నర్సింహారావు, మాదిరాజు లక్ష్మణరావు, పెద్దబోయిన దుర్గాప్రసాద్‌లు సాధిక్ సతీమణి ఉషాదయాళ్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా సాధిక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దయాల కిశోర్‌దత్ తదితరులు పాల్గొన్నారు.